సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,31 జనవరి 2024



# సొసైటీ రైతుల బకాయిలు చెల్లించాలని టీడీపీ డిమాండ్

– పట్టణంలో ర్యాలీ నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే వర్మ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం కో – ఆపరేటివ్ సొసైటీలు రైతుల ఇన్సూరెన్స్ బకాయిలు తక్షణమే అందించాలని పిఠాపురం టౌన్ పార్టీ కార్యాలయం నుండి బైక్ లపై మాజీ ఎమ్మెల్యే వర్మ మరియు పార్టీ శ్రేణులు ర్యాలీగా బయలు దేరి చర్చి సెంటర్ నందు ధర్నా నిర్వహించారు. అనంతరం కో– ఆపరేటివ్ బ్యాంకు పిఠాపురం మేనేజర్ వారికీ వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ... పిఠాపురం నియోజకవర్గంలో రైతుల ఇన్సూరెన్స్ బకాయిలు రాయవరం సొసైటీ, చేబ్రోలు, గొల్లప్రోలు, పిఠాపురం, యండపల్లి, నాగులపల్లి మరియు కొత్తపల్లి సంభందించిన అన్ని కో –ఆపరేటివ్ లలో ఇవ్వవలసిన బకాయిలు సుమారుగా రూ. 10 కోట్ల ఉన్నాయని, తక్షణమే ఈ బకాయిలు చెల్లించాలని పిఠాపురం తెలుగుదేశం పార్టీ తరుపున, ఏలేరు రైతాంగం తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతాంగానికి పంట నష్టపరిహారాలు ఇవ్వడం లేదని, 2020 నుండి కో – ఆపరేటివ్ బ్యాంకులలో ఉన్న ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వడం లేదని విమర్శించారు. వైసీపీ నాయకుడు ఒక ప్రభుత్వ ఉద్యోగిని రోడ్డు పై ఈడ్చుకుంటూ కొట్టడం జరిగిందని, ఆ నాయకుడిని అరెస్ట్ చేయాలనీ, దేనికని అరెస్ట్ చేయకుండా ఉన్నారని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులు అండ దండలతో ఇటువంటి వాటికీ పాల్పడుతున్న వారి అందరిపై తక్షణమే చర్యలు తీసుకోని అరెస్ట్ చేయాలనీ తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్ల అప్పారావు, సురవరపు సుబ్బారావు, నల్లా శ్రీను, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను మరియు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫోర్జరీ సంతకాలతో.. పట్టాలిస్తాం

## రండి బాబు రండి



- ఐడియల్ నుంచి ప్రతాప్‌నగర్ సామర్లకోట రోడ్డులో రెవెన్యూ - ఇరిగేషన్ స్థలాలు కబ్జా..
- రెచ్చిపోయి మాజీ కార్పొరేటర్లు, ఓ గుడి చైర్మన్ భూదందా
- 70 గజాల స్థలం రూ.5 లక్షలకు విక్రయాలు
- కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను మింగేస్తున్న కబ్జా ల ముఠా
- అర్ధరాత్రి మట్టి పోస్తూ ఆక్రమణలు - ఆక్రమణ స్థలాల్లో షెడ్లు, బేస్‌మెంట్లు నిర్మిస్తున్నా పట్టని యంత్రాంగం
- నకిలీ సంతకాలతో ఇళ్ళ స్థలాలకు పోజీషన్ పట్టాలు





ఫోర్జరీ సంతకాలతో నకిలీ పోజీషన్ పట్టాలతో కాకినాడలో అధికార పార్టీ ముసుగులో ఓముఠా చెలరెగడం కలకలం రేపుతోంది.కాకినాడ–రాజమండ్రి వయా అనపర్తి కెనాల్ రోడ్డువిస్తరణకుకొన్నివందలకోట్లు ప్రపంచబ్యాంకు విడుదల చేయగా అందులో భాగంగా కాకినాడ–సామర్లకోట మధ్య నాలుగు లైన్ల రహదారి విస్తరణకు ప్రణాళికలు జరిగింది. దీంతో సామర్లకోట రహదారి ఆనుకొని కాలువ గట్టుపై ఉన్న ఆక్రమణలను అప్పటి టిడిపి ప్రభుత్వం తొలగించింది. నిర్వాసిత భాధితులకు అప్పుడే భూసేకరణ చట్టం ప్రకారం పరిహారంగా డబ్బులు చెల్లించి స్థలాలు స్వాధీనం చేసుకుంది రెవిన్యూ విభాగం.అయితే విస్తరణ పనులు ఆగిపోవడంతో రెవెన్యూ అధికారులుసేకరించిన భూమికొన్ని సంవత్సరాలుగా అలాగే ఖాళీగా ఉంది. అప్పటి మాజీ కార్పొరేటర్లు, అధికార పార్టీ గుడి ఛైర్మన్ కన్ను ఈ స్థలాలపై పడింది.స్థలాల్లో అర్ధరాత్రుల్లు మట్టి పోస్తూ ఆక్రమణ చేశారు. ఇక అమ్మకం పెట్టాలి.దీని కోసం వీరు కొందరితో కలసి గోల్‌మాల్ చేసి ఏకంగా తహశీల్దార్ సంతకాన్నే ఫోర్జరీ చేసి పోజీషన్ పట్టాలు జారీ చేసినట్లు చూపిస్తూ 70చదరపు గజాల స్థలాన్ని రూ.5 లక్షలకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. వీరు ఇస్తున్న పోజిషన్ పట్టాలు సరైనవా లేక నకిలీ ఫోర్జరీవా అన్నది తెలాల్సివుంది.అయితే ఇప్పటికే అనేక ప్లాట్లు అమ్మేసినట్లు చెబుతున్నారు. ఇలామోసపోతున్నపేదలను రక్షించడంతో పాటు.. కాకినాడ ముఖ అందం ఈరోడ్డు...అటువంటి ఈ రోడ్డును కొన్ని కోట్ల రూపాయల ప్రభుత్వ ధనంతో సేకరించిన కెనాల్ రోడ్డులోని రెవెన్యూ– ఇరిగేషన్ స్థలాలు కబ్జా కాకుండా చూడాల్సిన అధికారులు లీడర్ల చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్న వ్యవహారంతో సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

సూర్య బ్యూరో ఉమ్మడిగోదావరి జిల్లాలు :

- మిగతా 2 లో..

# ప్రజాసేవలో..అలుపెరగని నాయుడు



..పిఠాపురం తెరపైకి
.. జనసేన అభ్యర్థిగా
క్యాడర్ మద్దతు
..2019లో
చేజారిన గ్లాస్
..ఉదయశ్రీనివాస్‌పై
నాన్ లోకల్ ఆలోచన

కడారి తమ్మయ్య నాయుడు కార్యసాధకుడు. విద్యాధికుడు,వ్యాపారం, సేవ,రాజకీయం అన్నిటిలో ఆయన విజయాలు సాధించారు. తల్లిదండ్రులు,గురువుల క్రమశిక్షణ పూర్వక పెంపకం, ఉన్నత చదువు పూర్తి ,దేశంపై ఉన్న ఊరుపై అనురాగం,వృత్తిలో సాధించిన విజయంతో నూతనత్వం.నవసమాజనిర్మాణానికి యువతలో దాగివున్న నైపుణ్యం వెలికి తీయడం,దీన జనుల ఉద్దరణ.బడుగు బలహీన పేదల,యువత అభివృద్ధికి రాజకీయాల్లో చేరి పనిచేయడం ఆయనను నాయకుడిగా ముందుకు నడిపించే గొప్ప లక్షణాలు...



**కాకినాడ మేజర్‌న్యూస్ ప్రతినిధి**

పిఠాపురం జనసేనలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఒకటవ కృష్ణుడు వెళ్లిపోయాడు. రెండో కృష్ణుడు వచ్చాడు. ఆయన పని కూడా గాలి తీసిన బంతిలా ఉందంటున్నారు కేడర్. 2019లో ఓటమి చెందిన తర్వాత ఇంచార్జిగా ఉన్న మాకినీడి శేషుకుమారి ని తొలగించారు.ఆమెస్థానంలోతంగేళ్లఉదయ శ్రీనివాసుని నియమించారు. శేషు కుమారి తరహాలో ఉదయ శ్రీనివాస్ కూడా స్థానికేతరుడే.ఇప్పుడు ఆయన పని కూడా అయిపోయినట్లేఅన్నట్లుగా సీను మారింది. తాజాగా ప్రముఖ విద్యావేత్త కడారి తమ్మయ్య నాయుడు పేరు తెరపైకి వచ్చింది. వాస్తవానికి ఈయన పార్టీలో పాత కాపే. అయితే అనూహ్య పరిస్థితుల్లో శ్రీనివాస్ ఇంచార్జి అయ్యారు. 2019లో మాకినీడి శేషు కుమారి కి టికెట్ ఇచ్చారు. సర్వే రిపోర్ట్ వ్యతిరేకంగా ఉండటంతో ఆమె టికెట్ రద్దుచేసి తమ్మయ్య నాయుడును పోటీ చేయమని పార్టీ ఆదేశించింది .అయితే టికెట్ ఇచ్చి బీఫామ్ ఇచ్చిన తర్వాత వెనక్కి తీసుకుంటే క్యాడర్ చేదిరిపోతుంది. ఆమెకు మద్దతిస్తాను పోటీ చేయను అంటూ నేరుగా తమ్మయ్య నాయుడు పార్టీ అధినేత పవన్ కు సూచించారు. హామీ ఇచ్చినట్లుగానే ఆయన మనస్ఫూర్తిగా పార్టీ కోసం పనిచేశారు. ఆయన అనుచర వర్గం అంతా శేషు కుమారి విజయానికి కృషి చేశారు. దీంతో ఎక్కడో కాకినాడ నుంచి వచ్చిన శేషు కుమారి కి వైసీపీ గాలిలో కూడా 28 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. దీనికి కారణం తమ్మయ్య నాయుడు వర్గం మద్దతు అని ఇప్పటికీ క్యాడర్ చెబుతుంది. దీంతో పవన్ కు ఆయనపై మరింత అభిమానం పెరిగింది .ఈ నేపథ్యంలోనే తమ్మయ్య నాయుడుకు ఖచ్చితంగా పార్టీ పరంగా గుర్తింపు ఇస్తామని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు .ఆయన తండ్రి ,మేనమామ తదితరులు స్థానిక సంస్థల ప్రతినిధులుగా పనిచేసారు. స్వాతంత్ర సమరయోధుల కుటుంబానికి చెందినవారు. పైగా మాధురి విద్యాలయ అనే వేలాది మంది విద్యార్థులతో కూడిన విద్యాసంస్థ నిర్వహిస్తున్నారు. ఆది నుంచి తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. జనసేన సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరారు. వారాహి యాత్రకు వచ్చిన సందర్భంగా పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో మూడు రోజులు ఆయన నివాసంలోనే ఉన్నారు. మెట్ట ప్రాంతంగా పిలవబడే పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలు ప్రాంతానికి చెందిన నాయుడు కుటుంబానికి అనుచర వర్గం, బంధు వర్గం అధికంగా ఉంది. అంగబలం, అర్ధబలం పుష్కలంగా ఉన్న విద్యావేత్త. ఇప్పటివరకు పిఠాపురం నియోజవర్గం నుంచి గొల్లప్రోలు కు చెందిన వారికి ఎమ్మెల్యేగా అవకాశం రాలేదు. నియోజకవర్గంలో మొత్తం 2.38 లక్షల ఓట్లుండగా ఒక్క గొల్లప్రోలు మండలంలోనే 80 వేలు ఓట్లు ఉన్నాయి. నియోజవర్గం మొత్తం మీద 50 వేల పైచిలుకు ఓటు బ్యాంకు తమ్మయ్య నాయుడు సొంతం. ఇలాంటి నేపథ్యంలో ఉదయ శ్రీనివాస్ స్థానికేటారుడు. ఆయనకి టికెట్ ఇస్తే టిడిపి తరఫున కచ్చితంగా పోటీ చేస్తామంటూ ఇప్పటికే టిడిపి సీనియర్లు ప్రకటించారు. వర్మ స్వతంత్రంగా పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. కానీ రాజకీయాల్లోకి రాకముందు నుంచి అటు వర్మ కు, ఇటు తమ్మయ్య నాయుడు కు మంచి సాన్నిహిత్యం ఉంది. రెండు పార్టీల పొత్తులో వర్మకి టికెట్ ఇస్తే తాను మనస్పూర్తిగా పనిచేస్తానని ఇప్పటికే తమ్మయ్య నాయుడు ప్రకటించారు .

అదేవిధంగా తమ్మయ్య నాయుడుకు టికెట్ ఇస్తే తాను సహకరిస్తానని వర్మ కూడా ప్రకటించడం విశేషం. పిఠాపురం కాపు సామాజిక వర్గంలో అత్యధికంగా ఉన్న కాపు సామాజిక వర్గం ఆయన బంధువులే కావడం ఆయనకు కలిసి వచ్చింది. అదే విధంగా ఆయన సతీమణి సీతాదేవి కి అత్యంత సమీప బంధువు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొప్పన మోహన రావు .ఇన్ని ప్లస్ పాయింట్లు ఉండడంతో తాను కూడా పోటీకి సై అంటూ తమ్మయ్య నాయుడు రంగంలోకి దిగారు. టిడిపి వర్గాలు ఆయనకు మద్దతు ప్రకటించాయి .ప్రస్తుత ఇంచార్జిపై స్థానికేతరుడు అన్న ముద్ర తో పాటు ఆయన కేడర్‌కు అందుబాటులో ఉండడం లేదు, బౌన్సర్లను వేసుకుని తిరుగుతున్నాడు అన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో విద్యావేత్తగా, మెట్ట ప్రాంతానికి చెందిన గొల్లప్రోలు వాసిగా, బలమైన బంధు వర్గం ఉన్న తమ్మయ్య నాయుడు పేరు తెరపైకి వచ్చింది .ఆయనకు ఇతర సామాజిక వర్గాలలో కూడా మంచి పేరుంది . పేద వర్గాలకు ఉచితంగా విద్యను అందిస్తుండడంతో ఆ వర్గాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచాయి. ఈ నేపథ్యంలో పిఠాపురంలో జనసేన తరఫున పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే ఖచ్చితంగా తమ్మయ్య నాయుడు వర్గం వన్ సైడ్‌గా పవన్ కళ్యాణ్‌కు సపోర్ట్ చేస్తుంది.

అదేవిధంగా కూటమిలో టిడిపికి మద్దతు ఇచ్చినా పని చేయడానికి ఆ వర్గం సిద్ధంగా ఉంది. కానీ స్థానికేతరుడైన ఉదయ శ్రీనివాస్ కిస్తే తాము పని చేయమని ఆయన అనుచరులు చెబుతున్నారు .ఆయన మాత్రం పవన్ కళ్యాణ్ ఏది చెబితే అది చేసి తీరుతాను .పవన్ కళ్యాణ్ మాట తనకు శాసనం అంటున్నారు. ఇలాంటి నేపథ్యంలో పార్టీ మరోసారి సర్వే చేయించింది ఈ సర్వేలో కూడా తమ్మయ్య నాయుడు పేరు ముందున్నట్లు చెబుతున్నారు. ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ఆయన బయోడేటా సేకరించాయి. ఆయన బలమైన అభ్యర్థిగా ఇంటలిజెన్స్ వర్గాలు వైసీపీకి నివేదిక పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పీఠాపురం నుంచి పవన్ కళ్యాణ్ పోటీ చేయని పక్షంలో తమ్మయ్య నాయుడికి ఇస్తారన్న ప్రచారం జోరు అందుకుంది .ఆయన కూడా రాజకీయ కార్యక్రమాలు స్పీడ్ పెంచారు. ఇప్పటివరకు లోప్రొఫైల్ నిర్వహించిన తమ్మయ్య నాయుడు ఇప్పుడిప్పుడే రాజకీయంగా చురుగ్గా పావులు కదుపుతున్నారు. అందరి పెద్దల ఆశీస్సులు తీసుకుంటున్నారు.

జనసేన పార్టీ పెద్దలతో పాటు టిడిపి నాయకులు అండదండలు కూడా ఆయనకు ఉన్నాయి. దీంతో ఆయనే జనసేన పిఠాపురం అభ్యర్థి అవుతారంటూ కేడర్ చెబుతోంది .ఉదయ శ్రీనివాస్ చేతులారా తన నాయకత్వాన్ని పాడు చేసుకుంటున్నారని, సామాన్యులను కలవడం లేదని ,కార్యకర్తలు అందుబాటులో ఉండడం లేదని ప్రచారం జరుగుతున్న సమయంలో అనూహ్యంగా తమ్మయ్య నాయుడు పేరు తెరపైకి రావడంతో జనసైనికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# క్రీడా పోటీలు శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

– కలెక్టర్ హిమాన్సు శుక్లా



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అమలాపురం క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు జిల్లా స్థాయిలో ఆడదాం ఆంధ్రా టోర్నమెంట్ 31 జనవరి– 2024 నుండి 4 ఫిబ్రవరి 2024 వరకు టోర్నమెంట్ శాంతియుత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా మంగళవారం ఒక ప్రకటన ద్వారా అధికారులకు సూచించారు. ఈ క్రీడల నిర్వహణ నిమిత్తం కొంత మంది అధికారులకు విధులు బాధ్యతలు కేటాయిం చడం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించారు. 15 ఏళు పైబడిన పురుషులు మరియు స్త్రీల కోసం విడి విడిగా ఐదు క్రీడాంశాలలో పోటీలు నిర్వహించాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, బ్యాడ్మింటన్ క్రీడా పోటీ లను ప్రభుత్వం తెలియజేసిన షెడ్యూల్ ప్రకారం, జిఎంసి బాలయోగి స్టేడియంలో 31 జనవరి– 2024 నుండి 4 ఫిబ్రవరి 2024 వరకు జిల్లా స్థాయిలో ఆడుదాం ఆంధ్రా నిర్వహించాలన్నారు. జిల్లాస్థాయిలో జిఎంసి బాలయోగి స్టేడియం నందు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ఓవరాల్ ఇన్చార్జిలుగా స్థానిక ఆర్డిఓ, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడి ఇన్చార్జిలుగా వ్యవహరిస్తారన్నారు. జిల్లా స్థాయిలో క్రీడాకారులకు అధికారులకు త్రాగునీరు భోజన ఏర్పాట్లు డి ఎల్ డి వో అమలా పురం వారు చేపడతారన్నారు. వేదికల వద్ద పారిశుధ్య పనుల ఏర్పాట్లు మున్సి పల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి చేపడతారన్నారు. క్రీడాకారులకు రవాణా ఏర్పాట్లు గ్రామ వార్డు నోడల్ అధికారి, జిల్లా రవాణా అధికారి సమన్వయంతో చేపడతారన్నారు. క్రీడాకారులకు వసతి ఏర్పాట్లుపై జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, బీసీ వెల్ఫేర్ అధికారి సమన్వయం వహిస్తారన్నారు. వేదిక వద్ద వైద్య బృందాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏర్పాటు చేయాలని సూచించారు. వేదిక వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు ,క్రీడాంశాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు. ఆన్‌లైన్ క్రీడాంశాల స్కోలింగ్ అప్డేట్, ఫలితాలు వెల్లడికి ఎంపీడీవో అల్లవరం వారు సమన్వయం వహిస్తారన్నారు. జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు ప్రారంభం, ముగింపు కార్యక్ర మాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు పర్యవేక్షించాలన్నారు.

# ఇళ్ళ పట్టాలకు త్వరలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

– ఖర్చులేకుండానే ఉచితంగానే రిజిస్ట్రేషన్లు
– కమిషనర్ నాగనరసింహారావు సమీక్ష



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో మంజూరైన ఇళ్ళ స్థలాలపై లబ్ధిదారులకు పూర్తిస్థాయి హక్కు కల్పించేందుకు ఆయా స్థలాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేయనుందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగన రసింహారావు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు.ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఇళ్ల స్థల లబ్ధిదారులందరినీ గుర్తించి రిజిస్ట్రేషన్లు చేయించేందుకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని సూచించారు. ఆయా లబ్ధిదారుల ఫొటో,ఆధార్,ఇళ్ళపట్టా ఆధారంగా ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగానే రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. అలా రిజిస్ట్రేషన్ చేయడం వల్ల స్థలంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయి హక్కు లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు, ఇతర మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రక్రియ పై దృష్టిసారించాలని కమిషనర్ ఆదేశించారు. కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో సుమారు 30 వేల మందికి ఇళ్ళ పట్టాలు ఇచ్చామని, వీరందరికీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించే అంశంపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు,టీపీఆర్వో మానేకృష్ణమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం




**అమలాపురం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంమండలంసాకూరు గున్నేపల్లి గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్రి ప్రమాదానికి సర్వం కోల్పోయిన బొలిశెట్టి వీరబాబు కుటుంబానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ మరియు జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా ఆదేశాల మేరకు ఆర్థిక సహాయం మంగళవారం అందించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ సూచనలతో రెడ్‌క్రాస్ వైస్ ట్రెజరర్ జల్లి సుజాత, రెడ్ క్రాస్ బాలరాజు, గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ పోలుమూరి బాలకృష్ణ చేతుల మీదుగా టార్పాలిన్, వంట సామాగ్రి, హైజిని కిట్, కిరాణా సరుకులు, కూరగాయలు, బట్టలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్న ప్రసాద్ , మరియు గ్రామ పెద్దలు సుబ్రహ్మణ్యం సాయిబాబు, ప్రసాద్, శ్రీరామ్ మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి నందు మందులు వేసుకొనుటపై అవగాహన



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు సూపరింటెండెంట్ జి.సూర్యకుమారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి నందు గల మందుల కౌంటర్ వద్ద పేషెంట్లకు ఇచ్చే మందులు ఎలా వేసుకోవాలో అనే దానిపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ ఫార్మసిస్ట్ సిహెచ్.కనకమహాలక్ష్మీ ఆధ్వర్యంలో కౌంటర్ వద్ద ఫార్మసిస్ట్ పద్మజ పేషెంట్లకు ఇచ్చే మందులపై మార్కర్ పెన్‌తో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎలా వేసుకోవాలో వ్రాసి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కౌంటర్ వద్ద ఇచ్చే మందులపై ఈ విధంగా ప్రతీరోజు పేషెంట్లకు వ్రాసి ఇవ్వడం జరుగుతుందని, కావున పేషెంట్లు అవగాహనతో సహకరించాలని సీనియర్ ఫార్మసిస్ట్ కనకమహాలక్ష్మీ తెలిపారు.

## మహిళలకు న్యూట్రి గార్డెన్‌పై అవగాహనా కార్యక్రమం



**గోకవరం, మేజర్ న్యూస్ :** జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ఏపిసిఎన్ఎఫ్ మరియు రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గోకవరం మండలం వీర లంకపల్లి గ్రామం లో రామకృష్ణ వ్యవసాయ క్షేత్రంలో మహిళలకు న్యూట్రి గార్డెన్ మరియు సూర్యమండలం మోడల్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలందరూ ఇంటి ఆవరణలో తొమ్మిది నుంచి 12 రకాల ఆకుకూరలు, కాయగూరలు పెంచుకోవాలని దీనివల్ల నిరంతర ఆదాయం మరియు ఆరోగ్యకరమైన ఆహారం తినవచ్చని మహిళలందరికీ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోకవరం మండలం ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది మరియు ఎస్‌హెచ్‌జి మహిళలు ఆదర్శ రైతు కోరుపల్లి అప్పలస్వామిగారు పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర ద్రోహి చంద్రబాబు



**- పోలవరం భ్రష్టు పట్టించింది బాబు**
**- స్కీమ్‌ల పేరుతో భారీ స్కామ్‌లకు పాల్పడింది చంద్రబాబు**
**- మీడియా సమావేశంలో చంద్రబాబుపై నిప్పులు చెరిగిన రాజమండ్రి ఎంపీ భరత్**

**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ద్రోహి..రాష్ట్ర అభివృద్ధిని, ఈ రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన ద్రోహి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ నిప్పులు చెరిగారు. మంగళవారం నగరంలోని జేఎన్ రోడ్డు ఏకేసీ కళాశాలకు అనుకుని ఉన్న పార్కులో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబుకు బహిరంగ సవాళ్ళు విసిరారు. ఏపీకి ప్రత్యేక హోదా రాకుండా చేసింది టీడీపీ చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టును సర్వ నాశనం చేసింది చంద్రబాబు అని ఆరోపించారు. ఈ విషయంలో టీడీపీ నేతలు, ఇంజనీరింగ్ అధికారులు ఎంతమందిని తీసుకొచ్చినా నేను ఒక్కడినే చర్చకు వస్తా..చంద్రబాబుకు ఆ దమ్మూ ధైర్యం ఉందా అని సూటిగా ఎంపీ భరత్ ప్రశ్నించారు. నలభై సంవత్సరాల రాజకీయ అనుభం, 14 సంవత్సరాలు సీఎం చేశానని గొప్పలు చెప్పుకోవడం తప్పిస్తే, రాష్ట్రంలో ఏ ఒక్క నియోజకవర్గాన్నైనా నేను రాజమండ్రిని అభివృద్ధి చేసినట్టు, కనీసం నాల్గవ వంతైనా చేశావా అని చంద్రబాబును ఉద్దేశించి ప్రశ్నించారు. పుష్కరాలకు రూ.2 వేల కోట్లు శాంక్షన్ చేశావని చెప్పుకోవడం తప్పిస్తే..ఆ నిధులతో రాజమండ్రిలో ఏమి చేశావో చెప్పగలవా..చూపగలవా అని ప్రశ్నించారు. పందికొక్కుల్లా బొక్కేసి మళ్ళా నీతిపరుల్లా ఫోజులా అన్నారు. నేను ఎంపీగా ఈ నాలుగున్నర ఏళ్ళలో కేవలం రూ.400 కోట్లతో రాజమండ్రి రూపు రేఖలు మార్చా. ఎప్పుడొచ్చామన్నది కాదు..ఎంత అభివృద్ధి ఎవరి కాలంలో జరిగిందనేది ప్రధానమని అన్నారు. పార్లమెంటులో నేను మాట్లాడినట్టుగా నీ పార్టీ ఎంపీలు గత పది సంవత్సరాల రికార్డు పరిశీలించి చెప్పు అన్నారు. రాష్ట్ర, జాతీయ సమస్యలపై లోక్‌సభలో ఎక్కువగా మాట్లాడింది నేనే అన్నారు. నీకేమైనా దమ్మూ ధైర్యం ఉంటే రాజమండ్రిలో ఎమ్మెల్యేగా నాపై పోటీ చేయి..నవ్వు కాకపోతే నీ కొడుకు పప్పుసుద్ద లోకేష్ నైనా ఇక్కడికి పంపి నన్ను ఓడించు అని భరత్ సవాల్ విసిరారు.

**-నాపై వేసిన అభాండాలు నిరూపించగలవా..?**

ఆవ భూములలో రూ.150 కోట్లు కొట్టేశానని, వర్కులో 15 శాతం తీసుకుంటానని అభాండాలు వేశావు..ఒక్క దాంట్లో అయినా నిరూపించగలవా అని చంద్రబాబును ఉద్దేశించి ఎంపీ భరత్ సూటిగా ప్రశ్నించారు. ఏ ఒక్కటి నిరూపించినా రాజకీయాలు వదిలేస్తా అన్నారు. నేను ఇక్కడే పుట్టా, ఇక్కడే పెరిగా..నా ఊరును అభివృద్ధి చేయాలనే కాంక్ష తప్పిస్తే రాజకీయాలను అడ్డుపెట్టుకుని సంపాదించాలనే యావ నీకులా నాకు లేదన్నారు.

**-ఏకేసీ పార్కు..ఎన్టీఆర్ పార్కు ఎలా అవుతుంది**

రాజమండ్రి నగరం జేఎన్ రోడ్డులోగల పార్కును మహా నాయకుడు ఏకేసీ పేరు పెడితే..దానిని ఎన్టీఆర్ పార్కుగా 2015లో తీర్మానం చేసేసి ఎలా మారుస్తారని ప్రశ్నించారు. మేము తీర్మానిస్తున్నాం..ఈ పార్కుకు గతంలో ఏదైతే పేరు ఉందో, 'ఏకేసీ పార్కు'గా అలానే ఉండాలని. ఈ విషయమై కలెక్టర్, కమిషనర్ కు పంపిస్తానని అన్నారు.

**-సొమ్మొకడిది..సోకొకడిది..**రాజమండ్రి నగరంలో టీడీపీ చోటా మోటా నాయకులు ఫ్లెక్సీలు పెట్టుకుని ఆనందిస్తున్నారని ఎంపీ భరత్ ఎద్దేవా చేశారు. ఆర్ట్స్ కళాశాలలో అథ్లెటిక్ ట్రాక్ ను సుమారు రూ.30 లక్షలతో కామాక్షి ఇండస్ట్రీస్ మురళి, ఆర్ఎంసీ నిర్మిస్తే..అక్కడ ఫ్లెక్సీలు టీడీపీ వాళ్ళు పెట్టుకోవడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. అలాగే టెన్నిస్ కోర్టుకు గతంలో శాప్ రూ.25 లక్షలు శాంక్షన్ చేసిందట. కానీ పనులు గాలికొదిలేశారు. కాంట్రాక్టరే వదిలేశాడు. నేను ఎంపీ అయిన తరువాత పోలీసు డిపార్ట్మెంట్ సహకారంతో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేశానని చెప్పారు. అక్కడ టీడీపీ ఫ్లెక్సీలు. మచ్చుకు చేసిందేమీ లేదు కానీ..ఫ్లెక్సీలకు కొదవలేదన్నారు. ఒకే కుటుంబంలో మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే చేసినా చెప్పుకునేందుకు ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. నేను చేసింది ఏమిటోఈనగరప్రజలుచెబుతారనిఅన్నారు. రాజకీయాలను అడ్డుపెట్టుకుని వడ్డీ వ్యాపారాలు, చిట్ల వ్యాపారాలతో ప్రజలను బెదిరించే వారికి ఎందుకు ఓట్లు వేయాలని ఎంపీ భరత్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అహింసా, సత్యా గ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు



**అమలాపురం,మేజర్‌న్యూస్:**అహింసా, సత్యా గ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడు జాతి పిత అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. నుపూర్ అజయ్ పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 76వ వర్ధంతిని స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో మహాత్మా గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలతో అలంకరించి పుష్ప గుచ్చాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆ మహనీయుని వర్ధంతిని అమరవీరుల దినోత్సవంగా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దార్శనికత కలిగిన గాంధీజీ అణగారిన, అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడి చరిత్రలో చెరగని ముద్ర వేశారని శాంతి, అహింస పద్ధతులను ప్రోత్సహించడంలో ప్రపంచ దేశాలపై మహాత్మా గాంధీ విశేష ప్రభావం చూపారన్నారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ గాంధీజీ ప్రభావాన్ని గుర్తించి, అతని జయంతి అక్టోబర్ 2ను అంతర్జాతీయ అహింసా దినంగా నిర్ణయించిందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ అసలు పేరు మోహన్ దాస్ కరంచంద్‌గాంది అని, ఆయన అక్టోబర్ 2న 1869 పుట్టారని, 13 ఏండ్ల వయసులో అప్పటి ఆచారం ప్రకారంకస్తూరిబాయితో వివాహం జరిగిందన్నారు. అహింసను భారీ స్థాయిలో రాజకీయాలలో మొదట ఉపయోగించిన వ్యక్తి గాంధీజీ అన్నారు. 1948 జనవరి 30వ తేదీన మహాత్ముడిపై కాల్పులు జరపడంతో ఆయన తుది శ్వాస విడిచారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కే.కాశీ విశ్వేశ్వరరావు,సెక్షన్ సూపరింటెండెంట్లు పి.సుబ్రహ్మణ్యం,జలవనరులశాఖ డిఈశ్రీనివాసరావు,పాల్గొన్నారు.

## నేటి నుండి బొబ్బర్లంక బ్యారేజీపై రాకపోకలు నిలిపివేత



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ పూర్తిగా పాడైనందున మరమ్మత్తుల నిమిత్తం నేటి నుండి పది రోజులపాటు వాహనాల రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్లు డిఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. గత నెల రోజులుగా పైన ఉన్న తారు తొలగిస్తూ వచ్చారు. ఆ పనులు పూర్తవడంతో ఏర్పడిన గుంతల్లో కాంక్రీట్ వేసి పూడిక పనులు చేయనున్నారు. మరమ్మత్తుల నిమిత్తం ప్రభుత్వం సుమారు రెండు కోట్లు నిధులు మంజూరు చేయడంతో ఈ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు.

## సమస్యలపై కలెక్టర్‌కు పిర్యాదు చేసిన సర్పంచ్ గెడ్డం సుధ

**- సమస్యలు పరిష్కారానికి కలెక్టర్ హామీ**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం గ్రామంలో సమస్యలు పరిష్కారించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ శుక్ల కు సర్పంచ్ గెడ్డం సుధరాజు స్పందనలో కలెక్టర్ పిర్యాదు చేశారు. ఇటీవల పంచాయతీ సమావేశం జరిగిందని ఆ సమావేశానికి డిపిఓ సర్పంచ్‌కి కనీస సమాచారం లేకుండా పంచాయతీకి వచ్చారని అధికార పార్టీ నాయకుల చెప్పిన విధంగా సమావేశాన్ని ముంగించాలని నాపై ఒత్తిడి చేశారని కలెక్టర్ కు వివరించారు. పంచాయతీ నిధులను అధికార పార్టీ నాయకులు ఇష్టారీతిగా ఖర్చుచేసే విధంగా సమావేశాన్ని కొనసాగిస్తుండంతో తనకున్న అధికారం మేరకు సమావేశాన్ని వాయిదా వేశానని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రథమ పౌరురాలినని కూడా చూడకుండా డిపిఓ మాటతీరు వుందని కలెక్టర్‌కు తెలిపారు. తక్షణమే డిపిఓను పిలిచి సర్పంచ్ విధులకు ఆటంకం కలిగించడం సరైన పద్ధతి కాదని కలెక్టర్ మందలించి గ్రామంలో సమస్య లేకుండా 15 రోజులలో పరిష్కారించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో ప్రజల సమస్యలు తీర్చేందుకు తగు చర్యలు తీసుకుంటానని సర్పంచ్ సుధకు హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు తదితరులు ఉన్నారు.

## గృహాలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే చెందాలి

**- ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతాల్లో పిఎం అవాస యోజన-గృహాలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే చెందాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి చవలం రాంబాబు దొర డిమాండ్ చేశారు. రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం పిఎం ఆవాస్ యోజన స్కీం ద్వారా 11మండలాల్లో మంజూరు చేస్తున్న గృహాలు నిజమైన ఆదివాసీ పివిటీజి కొండరెడ్లకు మంజూరు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కానీ వాస్తవ విరుద్ధంగా లబ్ధిదారులు కాని వారికి 1/70 చట్టానికి విరుద్ధంగా నాన్-ట్రైబల్స్ ను చేసుకున్న గిరిజన మహిళల పేరున, తండ్రి పేరుతో ఉపాధి కార్డులు పొందిన మహిళల పేరున గృహాలు మంజూరు చేస్తున్నారని రాంబాబు దొర ఆరోపించారు. ఇటువంటి వారిని వెంటనే గుర్తించి జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మారేడుమిల్లి మండలంలో మారేడుమిల్లి పంచాయతీ మొదటి జాబితాలో మంజూరైన గృహాలు పివిటిజి కొండరెడ్డి గిరిజనులకు కాకుండా వేరే ఇతర కులాలను చేసుకున్న మహిళల పేరున గృహాలు మంజూరు కాబడి ఉన్నాయన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలు నుండి సైతం గృహాలు మంజూరు కాబడి ఉన్నాయన్నారు. ఇటువంటి వారిని అధికారులు గుర్తించి నిజమైన ఆదివాసులకు మాత్రమే గ్రామసభలు నిర్వహించి ఎంపిక చెయ్యాలని, దీనిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి చవలం రాంబాబు దొర విజ్ఞప్తి చేశారు.

# ఫోర్జరీ సంతకాలతో.. పట్టాలిస్తాం

**సూర్య బ్యూరో ఉమ్మడి గోదావరి జిల్లాలు :**కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 38వ డివిజన్ దేవినగర్ ,సామర్లకోట కెనాల్‌రోడ్డులోని రెవెన్యూ-ఇరిగేషన్ స్థలాలు కట్టల మాటున ఆక్రమణలు యధేచ్ఛగా జరిగి పోతున్నాయి.ప్రజల రోడ్డు అవసరాల కోసం రెవిన్యూ సేకరించిన భూ స్థలాలను కొందరు మాజీ కార్పొరేటర్లు ముఠాగా ఏర్పడి నకిలీ ఫోర్జరీ సంతకాలతో పోజీషన్ పట్టాలు సృష్టించి అమాయక పేదలకు 70 గజాల చొప్పున విడదీసిన స్థలాలను రూ.5 లక్షలకు బరితెగించి విక్రయాలు చేస్తున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి.ఆలా అమ్మేస్తున్న స్థలాల్లో షెడ్లు, పునాదులు భహిరంగంగా నిర్మిస్తున్న అడ్డుకునే అధికారే కనబడడం లేదు..

**నాలుగు లైన్ల రోడ్డుకు భూమి సేకరణ**

కాకినాడ-సామర్లకోట మధ్య ప్రపంచ బ్యాంక్ నిధులతో నాలుగు లైన్ల రోడ్డు వేయడానికి విస్తరణ పనులు గత టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రపంచ నిధులతో చేపట్టారు. రహదారి ఆనుకొని ఉన్న కాలువ గట్టుపై నివసిస్తున్నవారి నుంచి భూమి కొనుగోలు చేసి వారిని ఖాళీ చేయించి స్థలాలను స్వాధీనపర్చుకొని ఇళ్ళు వాకిళ్ళు కూల్చివేశారు. అయితే టిడిపి ఎంపి అవినీతితో రహదారి పనులు ముందుకు సాగలేదు. సేకరించిన స్థలాలు అలాగే ఖాళీగా ఉండిపోయాయి.

**అక్రమార్కుల కన్ను పడటంతో...**38వ వార్డులోని గత మాజీ కార్పొరేటర్లు, ఓ గుడి ఛైర్మన్‌గిరి వెలగబెడుతున్న వ్యక్తి ముఠాగా ఏర్పడి ఈ ఖాళీ స్థలాలపై కన్ను వేసారు. కనీస అవగాహన లేకుండా ..చట్టాన్ని లెక్కచేయకుండా.. ప్రజా అవసరాలకు ముఖ్యంగా కాకినాడ ముఖద్వారం నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు సేకరించిన స్థలాలను ఫోర్జరీ సంతకాలతో అంగట్లో అమ్మకాలు పెట్టారు. అర్ధరాత్రుళ్ళు ఎక్కడెక్కడి నుంచో మట్టిని తెచ్చి స్థలాల్లో నింపారు. అమాయకులకు అమ్మకాలు పెట్టారు. అధికార పార్టీ నాయకులుగా చెలామణీ అవుతూ ఇంత పెద్ద అక్రమానికి తెగించారు. ఇప్పటికే కొందరికి కొన్ని స్థలాలు అమ్మేసినట్లు చెబుతున్నారు. అయితే వారిలో కొంచెం భయం కూడా ఉన్నట్లు చెబుతున్నారు. అధినాయకుడికి తెలిస్తే తమ పని అంతేనని గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం సద్దేయాలని..ఇప్పుడు70 గజాల స్థలాలు 3 లక్షలకు తగ్గించి అమ్మస్తామని కబురు పెట్టినట్లు కొనుగోలుదారులు చెబుతున్నారు.

**మామూళ్ళ మత్తులో రెవెన్యూ**..ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం కాసుల కోసం కక్కుర్తి పడుతూ అడ్డదారులు అక్రమార్కులతో కలిసి తొక్కుతున్నారు. ఎంతో విలువైన కాకినాడ-సామర్లకోట నాలుగు లైన్ల రోడ్డుకు సేకరించిన స్థలాలు కబ్జా చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వీరికే చెల్లింది. కొన్ని కోట్లు ఖర్చు చేసి సేకరించిన భూమి కాపాడాల్సిన వ్యవస్థ నీరుగారిపోతుంటే... కాసులకు అమ్ముడైపోతుంటే ఎవరు రక్షిస్తారు..ఎవరు కాపాడుతారు అంటూ ప్రజలు గొల్లున ఏడుస్తున్నారు.

**నకిలీ ఫోర్జరీ పోజీషన్ పట్టాలు ఎలా వచ్చాయి..**కాకినాడ-సామర్లకోట రోడ్డు విస్తరణకు సేకరించి రెవిన్యూలో ఉన్న స్థలాలు ఐడియల్ కళాశాల నుంచి ప్రతాపనగర్ బ్రిడ్జి వరకు ఎలా కబ్జాకి గురయ్యాయి..ఏ మాజీ కార్పొరేటర్లు చక్రం తిప్పారు..దీని వెనుక నడిచిన యవ్వారం ఏమిటి.. అక్కడ నిర్మిస్తున్న నిర్మాణాల వెనుక ఉన్న షాడో లీడర్ ఎవరు.. వారి నుంచి ఎవరికి ఎంత అందింది.. ఎన్ని లక్షలు ఎవరెవరికి అందాయి.. ఫోర్జరీ సంతకాలు చేసింది ఎవరు.. అవి ఫోర్జరీయా లేక నోట్ల కట్టలకు ఆశ పడి రెవిన్యూ యంత్రాంగం ఇచ్చేసినవా ... అన్న విషయాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని ప్రజలు చేబుతున్నారు..

**రెవెన్యూ స్థలాలను కాపాడండి..**సామర్లకోట కెనాల్ వెంబడి ఉన్న రెవెన్యూ-ఇరిగేషన్ స్థలాలు కబ్జా కాకుండా భవిష్యత్‌లో నాలుగు వరసల రోడ్డు నిర్మాణం జరిగేలా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా, కాకినాడ డైనమిక్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సంక్షేమ పథకాలకై పోరుకు సిద్ధమైన భవన నిర్మాణ కార్మికులు

**- 2019 నుండి పెండింగ్ పరిహారాలు చెల్లించాలని డిమాండ్ - 1214 మెమో రద్దుచేయాలి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పథకాలను పునరుద్ధరించాలని, నిలుపుదల చేస్తూ ఇచ్చిన 1214 మెమో రద్దు చేయాలని, 2019 నుంచి పెండింగ్ పెట్టిన పరిహారాలను కార్మికులకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సిఐటియు అనుబంధం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కాకినాడ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బుల్లిరాణికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంఘ కార్యనిర్వహక అధ్యక్షులు చెక్కల రాజ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవననిర్మాణ కార్మికులకు ఈ ఐదేళ్ల కాలంలో తీవ్ర అన్యాయం చేసిందని, కార్మికుల దాచుకున్న లేబర్ సెస్ 2,500 కోట్లు దొడ్డిదారిన తన అవసరాలకు దారి మళ్లించేసి, కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన ప్రసూతి సహాయం, వివాహ బహుమతులు, సహజ మరణం, ప్రమాద మరణాల పరిహారాలను చెల్లించకుండా అన్ని పథకాలను 1214 మెమో ద్వారా అన్నిటిని స్వయానా ముఖ్యమంత్రి ఆదేశాలతో నిలుపుదలచేసి రెండువిధాల భవన నిర్మాణ కార్మికులను ముంచేసారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికశాఖ అధికారులకు, సచివాలయ సిబ్బందికి, అధికార పార్టీ ఎమ్మెల్యేలకు, రాష్ట్ర మంత్రులకు ఈ ఐదేళ్ల కాలంలో అనేక దఫాలు వినతులు ద్వారా, నిరసనల ద్వారా భవననిర్మాణ కార్మికుల సమస్యలను తెలియజేసినా చలనం లేకుండా బండ రాయిలా వ్యవహరించిందని విమర్శించారు. నవరత్నాల పేరుతో 10 మందికి పథకాలు ఇచ్చి, రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు చట్టబద్ధంగా భరోసానిచ్చే సంక్షేమబోర్డును నిర్వీర్యం చేసిందని, ఇదే సమయంలో ఇతర రాష్ట్రాలైన తెలంగాణా, కర్ణాటక, కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు అనేక కొత్త పథకాలను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డుల ద్వారా అందిస్తున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి చేసిన తప్పేంటో రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సిన సమయం ఆసన్నమయ్యిందని, అందుకు ఫిబ్రవరి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కార్మికులందరూ పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, కాకినాడ రూరల్ మండల నాయకులు టి.రాజా తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూకే స్నాతకోత్సవ ముఖ్యఅతిథిగా శేషాచారి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ 10వ స్నాతకోత్సవానికి విచ్చేయుచున్న ముఖ్యఅతిథి మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకట శేషాచారి ది.18.10.1972న కాకినాడలోని గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ప్రస్తుత యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ)లో విద్యనభ్యసిస్తున్నప్పుడు యూనివర్సిటీ ఎంట్రీ స్కీమ్ క్రింద ఇండియన్ నేవీలోని ఎలక్ట్రికల్ విభాగంలో నియమితులయ్యారు. ఫ్రిగేట్ ఐఎన్ఎస్ కద్మట్ మరియు రెండు డిస్ట్రాయర్లు ఐఎన్ఎస్ రాణా, ఐఎన్ఎస్ రణవీర్ సబ్ మెరైన్లలో సేవలందించి ఐఎన్ఎస్ కళింగట్ విశాఖపట్నం క్షిపణి స్థాపనలో ముఖ్యపాత్ర పోషించారు. ముంబైలోని నావల్ డాక్యార్డ్లో వివిధ హోదాలలో సేవలందించి జనరల్ మేనేజర్ పనిచేశారు.అనంతరం ఢిల్లీలోని నేవల్ హెడ్క్వార్టర్స్ డైరెక్టర్ వెపన్స్, ఎక్విప్మెంట్ మరియు ప్రాజెక్ట్ డైరెక్టర్ వెపన్స్, ఎలక్ట్రికల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ క్లాసిఫైడ్ ప్రోగ్రామ్లో పనిచేశారు. ఎస్. వెంకట శేషాచారి నౌకలు, జలాంతర్గాములు రెండింటికీ అనేక పరికరాలు మరియు వ్యవస్థల స్వదేశీకరణలో కీలక పాత్ర పోషించారు. ఆయన అనేక క్షిపణి వ్యవస్థల అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించారు. ఐఎన్ఎస్ రాణా జలాంతర్గామిని ప్రారంభించే ముందు ఆయన రష్యాలోని పోటి బ్లాక్ సీ పోర్టులో ఎక్విప్మెంట్ ఓరియెంటెడ్ కోర్సు, సికింద్రాబాద్లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్మెంట్ లాంగ్ డిఫెన్స్ మేనేజ్మెంట్ కోర్సు,న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజీలో ఎన్‌ఎసి కోర్సు పూర్తిచేశారు.

ఎస్.వెంకట శేషాచారి ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ మరియు చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ ప్రశంసలు అందుకున్నారు. నేవీలో నిర్విరామంగా అందించిన సేవలకు గాను ఆయనకు భారత ప్రభుత్వం విశిష్ట సేవా పతకంతో సత్కరించింది. డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ ఆధ్వర్యంలో నడపబడుతున్న మజగాన్ డాక్ లిమిటెడ్ (ఎండిఎల్)లో షిప్ బిల్డింగ్ డైరెక్టర్గా ఎంపికైన తర్వాత మార్చి 22, 2007లో రియర్ అడ్మిరల్ హోదాలో ఇండియన్ నేవీ నుండి తాత్కాలిక పదవీ విరమణ చేశారు. ఐఎన్ఎస్ శివాలిక్ క్లాస్ ఫ్రిగేట్స్, ఐఎన్ఎస్ కోల్కతా క్లాస్ డిస్ట్రాయర్స్ మరియు ఐఎన్ఎస్ కల్వరి క్లాస్ సబ్ మెరైన్లను ఆయన ఆధ్వర్యంలో నిర్మించారు. సముద్రంలోకి వెళ్లే డ్రెడ్జర్లు, ఎండిఎల్ షిప్ బిల్డింగ్ డైరెక్టర్గా ఉన్న సమయంలో రెండు మల్టీ పర్పస్ సపోర్ట్ నౌకలను కూడా నిర్మించారు. తదుపరి జూన్ 30, 2011న ఎండిఎల్ నుండి పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ తర్వాత ఆయన ఎల్&టి డిఫెన్స్ ఇండిపెండెంట్లో వైస్ ప్రెసిడెంట్గా నాలుగు సంవత్సరాలు మరియు సీనియర్ సలహాదారునిగా మూడు సంవత్సరాలు పనిచేశారు. అణు జలాంతర్గాములు మరియు నౌకాదళ నౌకల కోసం వివిధ పరికరాలు, వ్యవస్థలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు.

## కాకినాడ ఐడిఏ ఆధ్వర్యాన ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక గాంధీనగర్ పార్క్‌లో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.మహాత్మగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాకినాడ ఐడిఎ అధ్యక్షుడు డా.నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ అమరవీరుల దినోత్సవం లేదా షహీద్ దివాస్ భారతదేశంలో అనేక తేదీలలో జరుపుకుంటారని, భగత్ సింగ్, శివరామ్ రాజ్‌గురు మరియు సుఖ్‌దేవ్ థాపర్ అనే ముగ్గురు వీర స్వాతంత్ర్య సమరయోధులను బ్రిటిష్‌వారు ఉరితీసిన రోజు మార్చి 23 న అని, అలాగే, మహాత్మా గాంధీ జ్ఞాపకార్థం జనవరి 30న అమరవీరుల దినోత్సవం లేదా షాహిద్ దివస్‌గా పాటిస్తారని అన్నారు.డా. అడ్డాల మాట్లాడుతూ మన జాతిపిత మహాత్మా గాంధీ అహింసా, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందించిన మహనీయుడని, ఆ మహనీయుని వర్ధంతి (జనవరి 30)ని అమరవీరుల దినోత్సవంగా జరుపుకుం టున్నా మని, నిత్యం అహింసాయుత మార్గంలో సత్యమే పరమా వధిగా జీవించిన మహనీయుడని,అదే మార్గంలో భారతావనికి స్వాతం త్ర్యం సంపాదించిన అహింసావాది అని అన్నారు. ఈకార్యక్రమంలో డా.ఎస్.ఎస్.ఎస్.స్వరూప్, డా.చైతన్య,డా. కార్తీక్ పాల్గొన్నారు.

## రహదారి భద్రతా నియమాలు పాటించాలి




**కాకినాడ, మేజర్ న్యూస్ :** రహదారుల భద్రత నిమావళిని ప్రతిఒక్కరు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పేర్కొన్నారు. కాకినాడలోని జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జిల్లా రవాణశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. రవాణ శాఖ ఉప కమిషనర్ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రారంభించారు. వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎస్పీని లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం. ప్రతాప్ కుమార్ ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రహదారుల భద్రత వారోత్సవాలల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రహదారి భద్రత పై అవగాహప పెంపొందించ కొవలసిన అవసరం ఎంతైన ఉందన్నారు.

రవాణా శాఖ ఉప కమిషనర్ మోహన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ హావర్లో ఎవరైన సరే ఆసుపత్రికి తరలిస్తే క్షతగాత్రుల ప్రాణాలను కాపాడగలమని, అలా ఆసుపత్రికి తరలించిన వ్యక్తిపై ఎటువంటి కేసులు ఉండవ న్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసు కొని వచ్చిందని ఆసుపత్రిలో చేర్పించిన వ్యక్తికి ప్రశంసా పత్రంతో పాటుగా నగదు బహుమతి కూడా ప్రకటించడం జరిగి ందని వివరించారు ఈ కార్యక్రమంలో రవాణా, ఆర్టీసీ శాఖల ఉద్యో గులు రక్తదానం చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో మెడికోవర్, నాయిన, జిజిహెచ్ డాక్టర్ శారదాదేవి, టెక్నిషన్ హరి బాబుకు చెందిన వైద్యులు పాల్గొని వైద్య పరిక్షలను అందజేసారు ఈ కార్యక్రమంలో డిఎస్పీ మురళికృష్ణా రెడ్డి, ఆర్‌టిఒ సాయి ప్రసాద్, వెహికల్ ఇన్స్పెక్టర్లు మురళికృష్ణ, హరినాద్ రెడ్డి, లక్ష్మి కిరణ్, గౌరి శంకర్, కళాజ్యోతి, షణ్ముఖ శ్రీనివాస్, కానిస్టేబుల్ రాజు, ఆదిత్య, ప్రసాద్, లారీ ఓనర్స్ అసోసియేసన్ ఉపాధ్యాక్షులు సుధాకర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ గాంధీ వర్ధంతి వేడుకలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని గ్రామాల్లో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆత్రేయపురం శ్రీవల్లి దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కళ్యాణ మండపం ప్రాంగణంలో వాసవి క్లబ్ ఎస్ఎస్ఎస్ విజయం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళ్యాణ మండపం ప్రాంగణంలో స్వచ్ఛభారత్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పట్నాల నాగరాజు, కార్యదర్శి వెచ్చా నాగ వెంకట సుబ్రహ్మణ్యం, కోశాధికారి శ్రీకాకుళపు సత్యనారాయణ, జోన్ చైర్మన్ పేరూరి నాగేశ్వరరావు, సభ్యులు వెచ్చా గోపాలకృష్ణమూర్తి, పేరూరి శ్రీనివాస్, పచ్చిపులుసు నాగరాజు, కేదారశెట్టి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

# యూటిఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ పేపర్ పంపిణి



ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కస్తూరిబా పాఠశాల విద్యార్థులకు టెన్త్ క్లాస్ టెస్ట్ మోడల్ పేపర్లు యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ మోడల్ పేపర్‌ను భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య, వి.ఆర్.పురం మండలం మాజీ ఎంపీపీ సీతారామయ్య జ్ఞాపకార్థంగా అందజేయడం జరిగిందని యుటిఎఫ్ మండల కమిటీ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం ప్రత్యేకంగా విద్యార్థుల చదువులను దృష్టిలో పెట్టుకొని సులభతరంగా పరీక్షలు రాసే విధంగా ఈ మోడల్ పేపర్లను తయారుచేసి పాఠశాల విద్యార్థులకు అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జనరల్ సెక్రెటరీ కె.శ్రీనివాస్, బి.ప్రసాద్, విజయ, కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జెఎన్టీయుకె స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్ అందుకోబోతున్న వి.రాజన్న



కాకినాడ, మేజర్ న్యూస్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ 10వ స్నాతకోత్సవానికి గౌరవ డాక్టరేట్ అందుకునేందుకు విచ్చేయుచున్న టిసిఎస్ టెక్నాలజీ, సాఫ్ట్వేర్ & సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న బహుముఖ ప్రజ్ఞాశాలిగా 30 ఏళ్ల నుంచి పరిశ్రమలు, విద్యా వ్యవస్థలు మరియు ప్రభుత్వ విభాగాలలో తనదైన శైలిలో ముద్ర వేశారు. సేల్స్, డెలివరీ, బిజినెస్ ఆపరేషన్స్, మానవ వనరులు, పరిశోధనాభివృద్ధి, మార్కెటింగ్, ఆర్థికపరమైన సుస్థిరత, విద్య మొదలగు అంశాలలో అమెరికా, తైవాన్, చైనా, సింగపూర్ తదితర దేశాలు ఆయన సాంకేతిక అనుభవాన్ని వినియోగించుకుంటున్నాయి.ప్రస్తుతం ఆయన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసిఎస్)లో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గాను, గ్లోబల్ హెడ్ ఆఫ్ ద రమ్యూనికేషన్స్, మీడియా,టెక్నాలజీ బిజినెస్ గ్రూపులకు తన సేవలను అందిస్తున్నారు. దీనికి ముందుగా రాజన్న టెలీకాం ఓఈఎం బిజినెస్ యూనిట్కు నేతృత్వం వహించి ఆ యూనిటు రెండున్నర రెట్ల ఆదాయాన్ని సమకూర్చారు. గత 15 ఏళ్లుగా రాజన్న ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్రాలలో టిసిఎస్ రీజనల్ హెడ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాజన్న ఏపిటి ఆన్‌లైన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తూ విజయవాడలోని ఏపిటీ ఆన్‌లైన్ డెవలప్మెంట్ సెంటర్ను నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో హైదరాబాద్లోని టిసిఎస్ ప్రపంచ స్థాయిలో 3వ స్థానం సంపాదించడంతో పాటు 4500 ఉద్యోగాల నుంచి 90వేల ఉద్యోగాలు కల్పించి విజయబావుటాను ఎగురవేసింది.ఆసియా పసిఫిక్ రీజియన్ కు టిసిఎస్ డెలివరీ & ఆపరేషన్స్ విభాగంలో రాజన్న జనరల్ మేనేజర్‌గా ఉంటూ బిజినెస్ ఎక్సైన్స్, మెథడాలజీస్, ఎంఐఎస్‌లలో వినూత్నమైన సేవలు అందించారు. చైనాలోని టిసిఎస్‌లో రాజన్న సీఇఓ గా సేవలందించి సిఎంఎంఐ & పీసీఎంఎం లెవెల్-5లో ఐఎస్ సర్టిఫికేషన్ వచ్చేలా కృషి చేశారు. అలాగే తైవాన్లోని టిసిఎస్‌లో ఆయన రీజనల్ మేనేజర్ ఫోర్డ్ స్ట్రాటజిక్ పార్టనర్షిప్ మరియు సెటప్ ఆపరేషన్లను విజయవంతంగా నిర్వర్తించారు. పూణేలోని టాటా రీసెర్చ్ డెవలప్మెంట్ & డిజైన్ సెంటర్లోని ఆర్డి విభాగానికి సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ టూల్స్ అయిన నాన్ స్టాఫ్ ఎస్క్యూఎల్, కంపైలర్, సి-క్రాస్ కంపైలర్ మొదలగునవి సమర్థవంతంగా నిర్వర్తించి క్లిష్టమైన సాంకేతిక అంశాలను పరిష్కరించారు.రాజన్న నాయకత్వంలో టిసిఎస్ విద్యావ్యవస్థలతో మిళితమై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్షిప్స్, రీసెర్చ్ స్కాలర్ ప్రోగ్రాడ్ను నిర్వహించారు.పలు విద్యాసంస్థలకు సంబంధించిన బోర్డ్ ఆఫ్ మేనేజ్ మెంట్ & అకడమిక్ కౌన్సిల్స్‌లో రాజన్న సభ్యునిగా వ్యవహరిస్తూ పలు సేవలు అందించారు. జెఎన్టియుకెతో పాటు పలు అనుబంధ కళాశాలలకు బిఓఎస్ సభ్యునిగా వ్యవహరించి మొబైల్ కంప్యూటింగ్, పైథాన్, వెబ్ టెక్నాలజీస్, ప్రోడక్ట్ లైఫ్ సైకిల్ మేనేజ్ మెంట్, బ్లాక్ చైన్ టెక్నాలజీలలో సిలబస్ రూపకల్పనకు దోహదపడ్డారు.కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ), ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్టిఈ), హైదరాబాద్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ), ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ - ఇండియా (ఐఈ) లకు లైఫ్ మెంబర్ గా వ్యవహరిస్తున్నారు. రాజన్న ఎస్ఐటి వరంగల్ నుండి కంప్యూటర్ సైన్స్ %డ% ఇంజనీరింగ్ విభాగంలో మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ డిగ్రీసు పొందారు. అదేవిధంగా ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్లో బోర్డ్ ఆఫ్ ట్రస్టీగా వ్యవహరించడంతో బిసిఎస్ సహకారంతో 520 కంటి ఆపరేషన్లను, 33082 కంటి పరీక్షలను నిర్వహించారు. రాజన్న అధ్యక్షతన ఏసిటి ఆన్లైన్కు ఆర్థిక సహకారం అందిస్తూ పల్నాడు జిల్లాలోని 24 ప్రభుత్వ పాఠశాలల్లో 30 విద్యా వాలంటీర్లను నియమించారు. ఈ విద్యా వాలంటీర్లకు 35 రోజుల్లో 240గంటల పాటు రెసిడెన్షియల్ శిక్షణను ఇప్పించి టీచర్ల కొరతను అధిగమించారు. కోవిడ్ సమయంలో టిసిఎస్ తరపున తమ వంతు సహాయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెంటిలేటర్లు, టెస్టింగ్ కిట్స్, ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేశారు. టిసిఎస్ ఉద్యోగులకు కరోనా సమయంలో వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించి వారి కుటుంబాలను ఆదుకున్నారు. అలాగే 2014లో ఆంధ్రప్రదేశ్లో సంభవించిన హుద్ హుద్ తుఫాను సమయంలో సహాయక చర్యలకు రూ.10కోట్ల సహాయం అందించి నీటి కొరత, దివ్యాంగులకు పునరావాసం, విజయనగరం మరియు శ్రీకాకుళం జిల్లాల్లో పారిశుధ్యం మెరుగుపర్చడానికి చర్యలు తీసుకున్నారు.ఐటి పరిశ్రమలకు రాజన్న అందించిన సేవలను గుర్తించి గవర్నమెంట్ ఆఫ్ జిజియాంగ్ 'వెస్ట్ లేక్ ఫ్రెండ్షిప్' అవార్డును అందించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున 2007 బెబ్ ప్రొఫెషనల్ ఆఫ్ ద ఇయర్ అవార్డును హైదరాబాద్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) అందించారు. అలాగే 2012లో ఐటి పరిశ్రమకు అందించిన సేవలను గుర్తించి నాయుడమ్మ అవార్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించింది. వరల్డ్ హెచ్ఎ కాంగ్రెస్ 'గ్రేటెస్ట్ కార్పొరేట్ లీడర్స్ ఆఫ్ ఇండియా' అవార్డును అందించింది. ఎన్ఐటి వరంగల్ నుంచి 2016లో విశిష్ట పూర్వ విద్యార్థి అవార్డును రాజన్న అందుకోవడంతో పాటు 2019లో ఇంజనీరింగ్ %డ% టెక్నాలజీ విభాగంలో విశిష్ట సేవలను ప్రశంసిస్తూ రాజన్నకు గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్ను అందించింది. హైదరాబాద్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) వారు 2023 లో లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డును రాజన్నకి బహూకరించింది.

## వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షులుగా బోనం



**అమలాపురం, మేజర్ న్యూస్ :** వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షులుగా బోనం సత్య వరప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ప్రస్తుతం అమలాపురం ఛాంబర్ అధ్యక్షులుగా కూడా పనిచేస్తున్నారు. గతంలో ఆయన వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా, అమలాపురం బులియన్ అసోసియేషన్ అధ్యక్షులుగా, జిల్లా బులియన్ అసోసియేషన్‌లో కూడా ఆయన కీలక పదవులు అందుకున్నారు.

## ఆదిత్య పి.జి. క్యాంపస్‌లో ఎం.సి.ఎ. విద్యార్థులచే ఘనంగా దేవ్ మేవారిక్ ఈవెంట్





**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆదిత్య పి.జి. క్యాంపస్‌లో ఎం.సి.ఎ. విద్యార్థులచే దేవ్ మేవారిక్ ఈవెంట్‌ను క్రియాటివో సంస్థ టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ అయిన తరాలభూపతి మరియు సరికొండ విజయ్‌ల ఆధ్వర్యంలో జరుపబడింది ముఖ్య అతిథులుగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్. బి.ఇ.వి.ఎల్.నాయుడు, ఆదిత్య స్కూల్ అఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ డి.బ్యూలా, మేనేజ్మెంట్ ప్రిన్సిపాల్ పి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ జి.సత్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఆదిత్య ఎల్లప్పుడు కొత్త టెక్నికల్ వైపు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఉంటుందని అందులో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్, వెబ్ టెక్నాలజీ మీద ఎం.సి.ఎ. విద్యార్థులకు 60 గంటలు ట్రైనింగు ఇవ్వడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డి.బ్యూలా తెలిపారు. అనంతరం విద్యార్థులకు రియల్ టైం, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మీద పోటీలు నిర్వహించారు. విద్యార్థులు అందరూ నూతన ఉత్సాహంతో పోటీలలో పాల్గొనడం జరిగింది. ఈ పోటీలలో విద్యార్థులకు కోడింగ్, ప్రజెంటేషన్, డాక్యుమెంటేషన్, టీమ్ వర్క్, అవుట్ పుట్స్‌ని విద్యార్థులందరూ వారివారి నైపుణ్యాలతో చూపించడం జరిగింది. ఇలాంటి రియల్ టైం ప్రాజెక్ట్ మీద అవగాహన కల్పించడం వల్ల విద్యార్థులలో మంచి టెక్నికల్ నైపుణ్యాన్ని వెలికి తీయడం మరియు భవిష్యత్తులో ఉద్యోగాల కొరకు పోటీని ఏ విధంగా ఎదుర్కోవాలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలో ఉపయోగపడుతుందని తెలియజేశారు.అనంతరం ఈ పోటీలలో మంచి ప్రాజెక్టుగా ఎంపికైన విద్యార్థులకు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు చేతులు మీదుగా బహుమతులు మరియు ప్రశంసాపత్రాలు ఇవ్వడం జరిగినదని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు.

## వాసవి క్లబ్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** వాసవి క్లబ్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా వాసవి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ సురేష్, గౌరవ అతిథిగా వాసవి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ (మల్టిపుల్ ) మడిపల్లి భాస్కరం హాజరయ్యారు. వాసవి క్లబ్ కొవ్వూరు శాఖ అధ్యక్షులుగా దేవతు కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా రాఘవ రమాకాంత్, కోశాధికారిగా సత్యవరపు గురునాథం కార్యవర్గ సభ్యులతో వాసవి డిస్ట్రిక్ట్ గవర్నర్ వలివేటి ప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ నూతన అధ్యక్షులు దేవతు కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టి కొవ్వూరు వాసవి క్లబ్ కు మంచి గుర్తింపు తీసుకొస్తానన్నారు. వాసవి క్లబ్ ద్వారా ఆర్యవైశ్యులతో పాటు అన్ని రంగాల వారికి సేవలు అందిస్తాన న్నారు. 2024 క్లబ్ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మద్దుల సోమరాజు, మద్దుల సత్యనారాయణ, కొల్లేపర శ్రీనివాస్, జయవరపు లక్ష్మి, నాళం వీర వెంకట శ్రీనివాస్, మన్యం గుప్తా, పెరుమళ్ళ వీరేశ్వరరావు,నాగవరపు మహేష్, గందీ ప్రవీణ్, పలుకూరి రాంబాబు, కక్కిరాల సూరిబాబు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలలో సదుపాయాలను ఆధునీకరించాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజలలో పుస్తక పఠనాశక్తిని పెంచేలా జిల్లాలోని గ్రంథాలయాలలో సదుపాయాలను ఆధునీకరించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను కోరారు. మంగళవారం మద్యాహ్నం తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్, సర్వసభ్య సమావేశం సంస్థ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధ్యక్షతన ఆమె ఛాంబర్‌లో జరిగింది. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ 2023-24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2024-25 సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదించారు. వివిధ ప్రభుత్వ గ్రాంటులు, గ్రంథాలయ సెస్ నిధులతో పుస్తకాలు, పత్రికల కొనుగోళ్లు, శాఖా గ్రంథాలయాల భవనాలకు మరమ్మత్తులు, అద్దెల చెల్లింపు, సిబ్బంది జీతభత్యాలు తదితర పద్దుల క్రింద అంచనాలతో ప్రతిపాదనలను రూపొందిచారు. జిల్లాలో శాఖా గ్రంథాలయాలు, గ్రామీణ గ్రంథాలయాలు లేని చోట్ల పుస్తక పంపిణీ కేంద్రాలు ఏర్పాటు, కేర్‌టేకర్‌ల నియామకానికి ఆమోదం తెలిపారు. పాఠకులు, విద్యార్థులకు అవసరాలు, అభిరుచులకు అనుగుణమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి, మెరుగైన వసతులతో గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించి అందుకు అవసరమైన నిధులు కొరకు బడ్జెట్‌లో ప్రతిపాదించాలని జాయింట్ కలెక్టర్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంసథ కార్యదర్శి వి.ఎల్.ఎన్.ఎస్. వరప్రసాద్, విద్య, పంచాయితీ, వయోజన విద్య, సమాచార పౌర సంబంధాలశాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌లు నిరసన దీక్ష



**అమలాపురం, మేజర్ న్యూస్ :** తమ డిమాండ్లుగా ఉన్న 16 అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్స్ ఆఫ్ సర్పంచుల సంఘం నిరసన దీక్ష చేపట్టింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్థంభం సెంటర్లో మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రంబాల రాంబాబు నాగ బత్తుల శాంత కుమారి సుబ్బారావు. మూడు జిల్లాలకు చెందిన సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పరమట శ్యాంకుమార్, అడబాల తాతకాపు, పెద్దిరెడ్డి రాము, చిక్కం పెదబాబు, జాలెం సుబ్బారావు, నక్క కృష్ణవేణి, పోతుకుర్రు సత్తిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**- 15 లీటర్ల నాటు సారా స్వాధీనం**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని వెలిచేరు కుమ్మరి గూడెంలో పోలీస్ ఎస్ఈబి అధికారులు దాడులు నిర్వహించారు. నాటు సారా అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కొత్తపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్సై బి.వై.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాటు సారా తయారీ చేసినా లేక రవాణా చేసిన లేక అమ్మినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జనసేన ఆధ్వర్యంలో మహాత్మా గాంధీకి ఘన నివాళి



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఎ.సి సభ్యులు మరియు కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో నేడు జగన్నాధపురం వెంకటేశ్వర స్వామి మందిరం ప్రాంతంలో జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ ఆధ్వర్యంలోను, 20 డివిజన్ ముత్తానగర్ గాంధీ సెంటర్ ప్రాంతంలో వార్డు అధ్యక్షులు బస్వాని నాగబాబు ఆధ్వర్యంలోను, పర్లో పేట ప్రాంతంలో సిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ మద్దు విజయ్ ఆధ్వర్యంలోను దుమ్ములపేట వార్డు అధ్యక్షులు దాసరి వీరబాబు ఆధ్వర్యంలోను జరిగిన కార్యక్రమాలలో ముత్తా శశిధర్ పాల్గొని మహాత్మా గాంధీ గారికి నివాళులు అర్పించడం జరిగినది. అనంతరం మేము సిద్ధం కార్యక్రమాన్ని జరపడం జరిగినది.ఈసందర్భంగా ముత్తా శశిధర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యంకోసం గాంధీ మహాత్ముడు చేసిన పోరాటం అందరికీ ఆదర్శమనీ, అహింసతో కూడా పోరాటం చేసి మన ఆశయాలని సాధించవచ్చని ఋజువు చేసారన్నారు. మన భావితరాలకి ఈస్ఫూర్తిని అందచేయడం ప్రతిఒక్కరి కర్తవ్యమన్నారు. దురదృష్టవశాత్తూ మహాత్ముని సహచరులు ఐన భారతదేశ ప్రథమ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ విగ్రహాన్ని, నేతాజీ సుభాష్ చంద్రబోసు విగ్రహాలను మన జగన్నాధపురంలో ద్వారంపూడి తీసివేయించారనీ రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఈరాబోయే 60 రోజుల తరువాత ఈ జగన్మోహన రెడ్డికి, ద్వారంపూడికి, వై.సి.పి.కి ఫుల్ స్టాప్ పెడుతున్నామనీ అందుకు మేము సిద్ధమనీ, ప్రజలు కూడా సిద్ధమని చెపుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జనసేన నాయకులు దుగ్గిన బాబీ శ్రీమన్నారాయణ, పినిశెట్టి సురేష్, మల్లిపూడి శివాజీ, అక్షయ దుర్గ ప్రసాద్, బసవాని నాగబాబు, పెద్దిరెడ్డి రాజేష్, వరిపిల్లి ప్రసాద్, మోస ఏసేబు, దూడ తాతారావు, ఆది నారాయణ, బోడ పాటి మరియ, పెద్దిరెడ్డి సంతోషి, చోడిపల్లి సత్యవతి, సోనీ ఫ్లోరెన్స్, దారపు శిరీష, రచ్చా ధనలక్ష్మి, దీప్తి, తనంచింతల రమ్య మరియు సిటీ నాయకులు, వార్డు ఇంచార్జు, జనసైనికులు పాల్గొన్నారు.

# చనిపోయిన ఓట్ల తొలగింపునకు తోడ్పడండి



**- ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు**
**- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024లో భాగంగా చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించే విషయంలో రాజకీయ పార్టీలు కూడా తమవంతు సహకారం అందించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఓటర్ల తుది జాబితా అనంతర చర్యలు, ప్రగతిపై ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుది జాబితాలో ఉన్న చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఆయా పేర్లను తొలగించాలంటే మృతుల మరణ ధృవీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని, అయితే కొంత మంది కుటుంబసభ్యులు వీటిని ఇచ్చేందుకు సహకరించడం లేదన్నారు. డెత్ సర్టిఫికెట్ అందుబాటులో ఉన్నప్పుడే మరణాన్ని ధృవీకరించుకుని ఓటును తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ వంతు సహకారాన్ని అందించి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఈఆర్వోలు దొర, మురళీకృష్ణ, సీతాపతిరావు, నాగశాస్త్రులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్ఆర్‌సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బిఎస్పీ), గాంధీరాజు (కాంగ్రెస్), ఇతర అధికారులు ఉన్నారు.

# అబద్ధాలు, మోసం, కుట్ర, కుటిలత్వం...

**- ఇదేగా మీకు తెలిసింది**
**- ఇచ్చిన హామీలు నెరవేర్చిన జగన్‌పై విమర్శలా..!**
**- ఎవరో రాసిచ్చింది చదివి మాపై ఆరోపణలా!**
**- చంద్రబాబుపై ధ్వజమెత్తిన మంత్రి వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా**



**రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ :** కుట్ర ,కుతంత్రం, కుటిలత్వం, మోసం, అబద్ధాలకు చంద్రబాబు కేరాఫ్ అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ,రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజమెత్తారు. ఇంకా అబద్దాలతో నెట్టుకొద్దామని చూస్తున్నాడని విమర్శించారు.స్థానిక ఏవి అప్పారావు రోడ్డు శ్రీనివాస నగర్ లోని తన కార్యాలయంలో మంత్రి వేణు మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే రాజాతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహాత్మా గాంధీ సత్యమేవ జయతే అంటూ అహింసావాదంతో ఈ దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టారని అయితే చంద్రబాబు ముందుకు భిన్నంగా అసత్యమేవ జయతే అంటూ అబద్దాలను వల్లి వేస్తున్నారని మంత్రి వేణు విమర్శించారు. సోమవారం కాతేరులో జరిగిన తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా సభలో పెత్తందారులు, పేదలు అంటూ చంద్రబాబు గొప్పగా నీతులు చెప్పారని, అయితే ఆ సభలో నీడ పట్టున చంద్రబాబు ఉంటే, ప్రజలు ఎండలో మగ్గారని దీనిని బట్టి పెత్తందారులు ఎవరో అందరికీ అర్థమైందని ఆయన వ్యాఖ్యానించారు. చంద్రబాబు చెప్పేది ఒకటి చేసేది ఒకటి అని, పైగా ఆయన ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని హామీలు నెరవేర్చిన ఘనత జగన్ కి దక్కుతుందని అందుకే జగన్ పట్ల ప్రజలకు విశ్వాసం ఏర్పడిందని మంత్రి వేణు చెప్పారు. అబద్దానికి చంద్రబాబు, నిజానికి జగన్ నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆ నిజం పై నిందలు మోపేలా చంద్రబాబు చేసిన ప్రయత్నం ఫలించబోదని ఆయన వ్యాఖ్యానించారు.ఎవరైనా సరే అధికారంలోకి రావడం కోసమే పార్టీ పెడతారని అలాంటిది ఎవర్నో అధికారంలోకి తీసుకురావడానికి పవన్ కళ్యాణ్ ప్రయత్నించడం శోచనీయమన్నారు. ఏ పార్టీ అయినా పేదల సంక్షేమాన్ని కాంక్షిస్తుందని వారికి న్యాయం చేయడానికి ప్రయత్నాలు చేస్తుందని మంత్రి వేణు గుర్తుచేసారు. అలాంటిది వివిధ పథకాల ద్వారా పేదలకు సాయం అందిస్తున్న జగన్మోహన్ రెడ్డిని ఓడించాలని పవన్ కళ్యాణ్ అనడం, అన్యాయం కాదా అని ఆయన ప్రశ్నించారు.చంద్రబాబు 600 హామీలు ఇచ్చి ఆరు హామీలు కూడా అమలు చేయలేదని మంత్రి వేణు పేర్కొంటూ హామీలు అమలు చేసి, పేదలకు న్యాయం చేస్తున్న జగన్ ని ఓడిస్తాననడం ఎంతవరకు న్యాయమో విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు.చంద్రబాబు విద్యార్థులను, యువతను, మహిళలను, చివరకు వృద్ధులను సైతం మోసం చేశాడని మంత్రి వేణు విమర్శించారు

# వేదాల సారమే త్యాగయ్య కీర్తనలు - ఆకొండి





కాకినాడ, మేజర్ న్యూస్ : త్యాగయ్య కీర్తనలు వింటూ ఉంటే అన్ని వేదాల యొక్క సారాంశము మనకు అవగతమవుతుందని ప్రముఖ సంగీత విద్వాంసులు ఆకొండి రాజారావు అన్నారు. సద్గురు సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక నీలకంఠేశ్వర వాగ్గేయకార మండపంలో మంగళవారం 177వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు, అంతర్జాతీయ గాయని పెద్దాడ సూర్యకుమారి తొలుత శ్రీవేంకటేశ్వర స్వామి, త్యాగయ్య విగ్రహాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేయగా, సంగీత విద్వాంసులు అందరూ కలిసి పల్లకీ ఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం త్యాగయ్య కీర్తనలు వైభవంపై ఆకొండి రాజారావు ప్రసంగిస్తూ వాల్మీక పునర్జన్మగా త్యాగయ్యను అభివర్ణిస్తూ రాములవారిపై అనేక కీర్తనలను రచించారని చెప్పారు. అన్ని రామాయణ గ్రంధాలను త్యాగయ్య పఠించడమే కాక వారికి కీర్తనలలో ఆయొక్క ప్రస్తావన కనిపించాయని ఆయన చెప్పారు. వైరాగ్యంలో శుకమహర్షిని తలపించేలా ఇహలోక సంపదలకు లోనుకాకుండా పరలోక సంపద కోసమే నిత్యమూ తాపత్రయపడేవారని వివరించారు. ప్రహ్లాదుడిలా భగవంతునిపై అపారమైన భక్తివిశ్వాసంతో ఆయన జీవనంలో అనేక అంశాలను ప్రస్తావిస్తూ మహరాజు నుండి కానుకలు వచ్చినప్పటికీ సున్నితంగా తిరస్కరించిన వ్యక్తి అని అన్నారు. బ్రహ్మ చేసే సృష్టి కార్యక్రమం అయితే అపరబ్రహ్మ అయిన త్యాగయ్య సంగీత ప్రపంచాన్ని సృష్టించారని, అరవైకి పైగా జన్యురాగాలను సృష్టించి వాటికి ప్రాణం పోసారని గుర్తు చేసారు. 96 కోట్ల శ్రీరామ నామ తారకమంత్రాన్ని జపించిన ఏకైక వాగ్గేయకారుడని కీర్తించారు. ఆనాటి సమాజ పరిస్థితులను కూడా కీర్తన ద్వారా ప్రస్తావించిన గొప్ప సంఘసంస్కర్తగా కొనియాడారు. స్వరాలతో అభినయము చేయగల గొప్ప వ్యక్తని, పలు త్యాగయ్య కీర్తనలు ఆలాపిస్తూ ఆకొండి విశ్లేషించిన విధానం సభికులను మంత్రముగ్ధులను చేసింది. త్యాగయ్య స్వరాలను పరిశీలిస్తే భగవంతునికి సాష్టాంగ ప్రణామం చేసినట్లుగా సంగీత ప్రియులు అలౌకిక ఆనందాన్ని ఆస్వాదిస్తారని చెప్పారు. భగవంతుని యొక్క మహిమలతో పాటు శ్రీరామ అవతార విశేషాలను కూడా కీర్తనల ద్వారా లోకానికి అందిస్తూ వాటిలోని ఆంతర్యాన్ని లోకాసమస్త సుఖినోభవంతు అన్న విధంగా త్యాగయ్య కీర్తలను, జీవితం మనం పరిశీలించవచ్చున్నారు. ఆకొండి రాజారావును కాకినాడ మధ్వసభ కమిటి సంయుక్త కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ డా.యాతగిరి పరశురామ్ దుశ్వాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వక్కలంక రామకృష్ణతో పాటు, పెద్దాడ రామచంద్రరావు, పలువురు సంగీత విద్వాంసులు, విద్యార్థులు నగర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం పంచరత్న సేవలో అధిక సంఖ్యలో సంగీత కళాకారులు పాల్గొని ఆలపించారు.

## పిఠాపురం మున్సిపల్ కమీషనర్‌గా కనకారావు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మున్సిపల్ నూతన కమీషనర్ గా నామ కనకారావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ కమీషనర్‌గా పనిచేసిన కృష్ణవేణి సాధారణ బదిలీలలో భాగంగా నిడదవోలు బదిలీపై వెళ్లారు. నూతన కమీషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కనకారావు స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ గీతా విశ్వనాథ్ లను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నూతన కమీషనర్ ను పలువురు నాయకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి పుష్పాలు అందించి అభినందలు తెలియజేశారు.

## ఆదిత్యను సందర్శించిన కె.హేమచంద్రారెడ్డి



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డా. కె. హేమ చంద్రా రెడ్డి సూరంపాలెం ఆదిత్యా విద్యా ప్రాంగణం సందర్శించారు. ఆయనకు ఆదిత్య విద్యా సంస్థల అధినేత డా నల్లమిల్లి శేషారెడ్డి,డిగ్రీ కళాశాలల డైరెక్టర్ డా. ఎన్.సుగుణ రెడ్డి,ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వివిధ విభాగాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు లను పరిశీలించారు.ఆదిత్య టెక్నికల్ హబ్ ద్వారా విద్యార్థులకు నూతన టెక్నాలజీ పై అందిస్తున్న కోర్సులగురించి తెలుసుకుని అభినందించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతూ కేవలం సిలబస్ పరిధిలో అంశాలను పరిగణనలోకి తీసుకుంటే సరిపోదని నూతన ఆవిష్కరణలు ప్రపంచంలో జరుగుతున్న విజ్ఞాన అభివృద్ధిని గురించి తెలుసుకుని నూతన దృక్పదం కలిగివుండాలి,మన ఆలోచనలు వినూత్నంగా విలక్షణంగా ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో డా.ఎం.శ్రీనివాస రెడ్డి, డా.దోలా సంజయ్, డా.ఆదిరెడ్డి రమేష్,బాబ్జీ నీలం తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా చేయడానికి కనిపించిన పోర్టు భూములు

# సబ్ స్టేషన్ నిర్మాణానికి కనిపించలేదా ద్వారంపూడి - కొండబాబు

కాకినాడ, మేజర్ న్యూస్ : ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కబ్జా చేయడానికి కనిపించిన పోర్టు భూములు సబ్ స్టేషన్ నిర్మాణానికి కనిపించలేదని, ఎందుకు పనికిరాని ప్రైవేటు భూమిపై 251 కోట్లు కేడిఆర్ బాండ్లు మంజూరు చేయించి ద్వారంపూడి దోచుకున్నాడని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు విమర్శించారు. ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణానికి దుమ్ములపేట ప్రాంతం నందు 1:4 టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేసి కార్పొరేషన్ సేకరించిన 4.67 భూమిని మరియు గతంలో ద్వారంపూడి చేతిలో కబ్జాకు గురైన పోర్టు భూములను పత్రికా విలేకరల సమక్షంలో చూపించి ఆ ప్రదేశం నందు కొండబాబు పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ నగరంలో ద్వారంపూడి కబ్జాలు చేయడానికి కనిపించిన పోర్ట్ భూములు నగర అభివృద్ధికి కనిపించడం లేదని, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పేరుతో ఎందుకు పనికిరాని ప్రైవేటు భూమిని సేకరించి వాటికి 251 కోట్ల రూపాయలు విలువ బాండ్లు మంజూరు చేయించి కార్పొరేషన్ ఖజానాన్ని కొల్లగొట్టాడని కొండబాబు మండిపడ్డారు. గత తెలుగుదేశం ప్రభుత్వమే జీవో తీసుకొచ్చిందని ద్వారంపూడి చెబుతున్నాడని, గత తెలుగుదేశం ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అవసరాలకు సేకరించిన భూములకు తప్ప ద్వారంపూడి దోచుకోవడానికి కాదన్నారు. టిడిఆర్ బాండ్లతో



మున్సిపాలిటీ గాని ప్రభుత్వ ఖజానాకు కానీ నష్టం లేదని చెప్పే ద్వారంపూడి టిడిఆర్ బాండ్లు దేనికి ఇచ్చినట్టునని, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు కాకినాడ నగరంలో పోర్ట్ భూములు చాలా ఉన్నాయని, గతంలో పూలే పాకాల వద్ద సుమారు 8 ఎకరాలు పోర్ట్ భూమిని రాత్రికి రాత్రి ఫిల్లింగ్ చేసి కబ్జా చేస్తే, తాము అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పోర్టు భూములను కాపాడడం జరిగిందని గుర్తు చేశారు. ఆ భూములు ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ద్వారంపూడికి పనికిరావా అని కొండబాబు ప్రశ్నించారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాకినాడ సామర్లకోట రోడ్డు విస్తరణకు, కొండయ్యపాలెం ఫ్లై ఓవర్ నిర్మాణానికి, మెయిన్ రోడ్డు విస్తరణకు, రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి భూములను సేకరించి నగర అభివృద్ధికి కృషి చేయడం జరిగింది తప్ప, ద్వారంపూడిలా కార్పొరేషన్ ఖజానా కొల్లగొట్టే విధంగా టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేయలేదని, అలాగే పేద వర్గాల కోసం పోర్టు భూములను సేకరించి టిడ్కో గృహాలు నిర్మించడం జరిగిందని, గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహాలకు రంగులు వేసుకుని గొప్పలు చెప్పుకుంటున్నందుకు ద్వారంపూడి సిగ్గుపడాలని, సబ్ స్టేషన్ కోసం 4.67 ఎకరాలు సేకరించినందుకు అధికారులకు సన్మానం చేస్తానని ద్వారంపూడి చెబుతున్నాడని, సురేష్ నగర్ పార్క్ ప్రభుత్వ భూమిపై 160 కోట్లు, సబ్ స్టేషన్ పేరుతొ 251 కోట్లు విలువ చేసే టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేసి ప్రజాధనాన్ని దోచుకోవడానికి అవకాశం కల్పించిన అధికారులకు ఒక్క సన్మానం ఏమిటి ఇంకేమైనా చేస్తాడని కొండబాబు ఎద్దేవా చేశారు. చంద్రబాబు మోసం చేసిన పథకంలో పుట్టింది ఆసరా అని ద్వారంపూడి విమర్శలు చేశాడని, మహిళల ఆర్థికాభివృద్ధి తోడ్పాటుకు మహిళా సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు అందించిందే చంద్రబాబు అని, 45 సం. నిండిన ప్రతీ మహిళకు పెన్షన్ ఇస్తానని మహిళలను మోసం చేసిన మహిళా ద్రోహి జగన్ రెడ్డి అని కొండబాబు విమర్శించారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, బంగారు సత్యనారాయణ, చోడిపిల్లి సతీష్, కొంద్రు తాతారావు, ఎరుపిల్లి సత్తిబాబు, చోడిపిల్లి ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

## అజీమా జహారమ్మా ఆశయాలను కొనసాగిస్తాం

**– సంస్థ అధ్యక్షులు అహ్మద్ అలీషా**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమి పీఠాధిపతి డా: ఉమర్ ఆలిషా మాతృమూర్తి జేహర భేగం 6వ వర్ధంతి సందర్భంగా... అజీమా జహారమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు అహ్మద్ ఆలీషా వారి సోదరులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పళ్ళు మరియు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అహ్మద్ ఆలిషా మాట్లాడుతూ... అజీమా జహరమ్మ సేవా సంస్థ ద్వారా ఆమే ఆశయాలను కొనసాగించాలనే ఉద్దేశంతో ఈరోజు ప్రభుత్వ ఆసుపత్రిలో 200 మందికి, కాకినాడ ఉమా మనోవికాస కేంద్రంలో మానసిక వికలాంగులకు మరియు శ్రావణి వృద్ధ ఆశ్రమంలో పాలు, పళ్ళు మరియు రొట్టెలు పంపిణీ చేయటం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ పల్లీ సుజాత మాట్లాడుతూ... మేము అడిగిన వెంటనే... ఆసుపత్రికి మినరల్ వాటర్ ప్లాంట్ ఇవ్వటం జరిగిందని, ప్రతీ ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకొని ప్రయాణం చేయాలని కోరుకుంటూ వారి సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు హుసైన్ షా, ఖలీల్ షా, బాదుషా, ఆసుపత్రి డాక్టర్ కాకర రోజా ప్రియ, పీఠం సభ్యులు అల్లవరపు నగేష్, రేఖా ప్రకాష్, దేవు భాస్కర్, సానబోయిన కృష్ణ కుమార్, పెదపూడి చంటి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీజీ వర్ధంతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** అహింసకు మారుపేరు అయిన గాంధీజీ ని ప్రతివారు ఆదర్శంగా తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీవో జె సీతా రామారావు అన్నారు. స్వాతంత్ర సమరయోధులు, మాహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు సామర్లకోట పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం లో మున్సిపల్ కమీషనర్ జె రామారావు ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిధిగా ఆర్డీవో పాల్గొని గాంధీ విగ్రహానికి పూలామాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం గాంధీజీని ఆదర్శంగా తీసుకుని శాంతియుత జీవితాన్ని అలవర్చు కోవాలన్నారు. ఇంకా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తాహశీల్దార్ ఎస్ ఎల్ ఎన్ కుమారి ఆధ్వర్యంలో, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో డి శ్రీలలిత ఆధ్వర్యంలో, రైల్వేస్టేషయిన్ లో స్టేషన్ మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ లో గాంధీ యూత్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాల యాలఅధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ లు, పాల్గొన్నారు.

## స్వయం ఉపాధికి మెప్మా తోడ్పాటు

**– సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్వయం ఉపాధి పథకాలు ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా డ్వాక్రా సంఘాలకు మెప్మా అందిస్తోన్న సహకారం అభినందనీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సూర్యనారాయణపురంలో మెప్మా తోడ్పాటుతో ఆదర్శ టౌన్ లెవెల్ ఫెడరేషన్ సభ్యురాలు వరలక్ష్మి ఏర్పాటు చేసి ఆర్టిఫిషియల్ జ్యూయలరీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి మంగళవారం ప్రారంభించారు. రూ.90వేల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి మెప్మా ఆర్థిక తోడ్పాటును అందించింది. సులభవాయిదాలతో తక్కువ వడ్డీతో తిరిగి చెల్లించుకునేవిధానంపై ఈ రుణం మంజూరైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుటుంబపోషణలో భాగస్వామ్యులు అయ్యేందుకు ఇటువంటి పథకాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ప్రభుత్వం కల్పించేప్రోత్సాహకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి సూచించారు. ప్రారంభించిన వ్యాపారం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జెఎన్టీయుకె కాకినాడలో పదవ స్నాతకోత్సవం




కాకినాడ, మేజర్ న్యూస్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పదవ స్నాతకోత్సవ వేడుకలు బుధవారం ఉదయం 10.30 గంటల నుండి అలూమ్ని ఆడిటోరియం నందు నిర్వహించనున్నామని ఉపకులపతి డా.జీవిఆర్ ప్రసాదరాజు వెల్లడించారు. స్నాతకోత్సవం సందర్భంగా 2022–2023 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు. 10వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదానం చేయనున్న డిగ్రీల వివరాలకు సంబంధించిన సమచారాన్ని తెలియజేశారు. బీటెక్–34,199, బీ–ఫార్మశీ–1477, ఎంటెక్–1689, ఎంబిఏ–1093, ఎంసిఏ–343, ఎం. ఫార్మశీ–332, బిబిఏ–21, ఫార్మా–డి–182, మరియు బీ–ఆర్క్–13 మంది విద్యార్థులకు సంబంధిత డిగ్రీలను ప్రదానం చేస్తారన్నారు. అలాగే ఈ స్నాతకోత్సవంలో 64మంది రీసెర్చ్ స్కాలర్స్ పిహెచ్ డిగ్రీలు అందుకోనున్నారన్నారు. అలాగే ఛాన్సలర్ మరియు ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డులు, 28 బంగారు పతకాలు కూడా అందజేస్తారన్నారు.ఈ స్నాతకోత్సవానికి కులపతి మరియు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకట శేషాచారి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారన్నారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) టెక్నాలజీ, సాఫ్ట్వేర్ & సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న కి జెఎన్టియుకె తరపున గౌరవ డాక్టరేటు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. తాను ఉపకులపతిగా ఉన్న సమయంలో ఇది మూడవ స్నాతకోత్సవం అని, ఎనిమిదవ స్నాతకోత్సవం, తొమ్మిదవ స్నాతకోత్సవం, పదవ స్నాతకోత్సవం నిర్వహించామన్నారు. బుధవారం జరిగే స్నాతకోత్సవ వేడుకలకు పాలక మండలి సభ్యులు, మాజీ ఉపకులపతులు, అతిథులు, విద్యావేత్తలు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు, ఉన్నత విద్యాశాఖాధికారులు, జిల్లా అధికారులు, విద్యావేత్తలు, జెఎన్టియుకె టీచింగ్ & నాన్ టీచింగ్ స్టాఫ్, పిహెచ్ అవార్డు గ్రహీతలు, గోల్డ్ మెడలిస్టు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ఉపకులపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కె.వి.రమణ, రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, ఓఎస్‌డి ప్రొ. డి.కోటేశ్వరరావు, ఆర్ & డి డైరెక్టర్ ప్రొ.వి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై ఆటోడ్రైవర్‌లు నిరసన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసెందుకు ప్రకటించిన ఆర్టీసీ లో మహిళల ఉచిత ప్రయాణం పథకాన్ని రాద్దుచేసి ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సామర్లకోట పట్టణంలో ఆటో డ్రైవర్ లు మంగళవారం శాంతి ర్యాలీనిచేపట్టారు. సామర్లకోట పట్టణం లోని అన్ని ఆటో స్టాండుల సభ్యులు సుమారు 3 వందలమంది స్థానిక స్టేషన్ సెంటర్ రింగు సెంటర్ నుంచి భారీ ర్యాలీగా భయలుదేరి మట్టంసెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ వారు ధర్నా కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాద్దాలిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుద్దేశించిన ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటో కార్మికులుగా ఉన్న తాము పూర్తిగా ఉపాధిని కోల్పోతామన్నారు. ఇప్పటికే లక్షలాది రూపాయలు పెట్టి ఆటోలో కొని రకరకాల చార్జీలు చెల్లిస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాలను పోషించు కోవడం అతి కష్టమవుతుందాన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు ఎవరూ ఆటోలు ఎక్కని పరిస్థితులు ఎదురు అవుతాయాన్నారు. దానితో తమ కుటుంబాలాన్నీ రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారుకు వారు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం రద్దు చెయ్యాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన కార్యక్రమం లో పట్టణ పయిధిలోని అన్ని ఆటో యూనియన్ ల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

**– వికసిత భారత్ కార్యక్రమంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్ పంపిణి**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం కొత్తపేట రామాలయం వద్ద మంగళవారం ఉదయం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో వికసిత భారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విత్తనాల వెంకటరమణ, కరెడ్ల దేవి, చెరుకూరి రవికృష్ణ, దుర్గా మోహనరావు, అల్లు ప్రసాద్‌లు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీ గంగా హెచ్‌పి గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ తలాటం గంగాధరరావు ఆధ్వర్యంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను బిజెపి నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు డా.అనూష రాయ్, మున్సిపల్ ఆర్వో వి.చంద్రశేఖరం, స్టేట్ బ్యాంక్ మేనేజర్, మెప్మా సిఎంఎం భ్రమరాంబ, సిఓలు శ్రీదేవి, ఆర్‌పిలు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచార రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

## యెంట్రుకోన గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజీకి ఘన నివాళి



**అల్లవరం,మేజర్‌న్యూస్ :** యెంట్రుకోన గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వాతంత్ర సమర యోధులు గాంధీజీ వర్ధంతి కార్యక్రమం గ్రామ సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతు గాంధీజీ శాంతి, అహింస, మానవసేవను ఆయుధాలుగా తీసుకుని స్వాతంత్ర్య సమరంలో విజయం సాధించిన త్యాగమూర్తి, జాతి పిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఇవే మా ఘననివాళులు అని నివాళులర్పించారు.

## కుష్ఠు వ్యాధిగ్రస్థులకు అవగాహన, ప్రతిజ్ఞ



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : జనవరి 30 నుండి ఫిబ్రవరి 13వ తేది వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కాంద్రకోట పిహెచ్‌సి ప్రధాన వైద్యులు డా.చంద్రకిరణ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధి కుష్ఠు వ్యాధిగ్రస్థులకు చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దీనిలో భాగంగా కాంద్రకోట పిహెచ్‌సి నందు మహాత్మాగాంధి వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.సిరివాడ గ్రామంలో వైద్యులు చంద్రకిరణ్ బాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ సెక్రటరీ ఎ.భారతి ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమం, జనవరి 30 నుండి ఫిబ్రవరి 13వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.ఉషప్రియదర్శిని, సిహెచ్‌ఓ బి.శాంతారత్నం, పి. హెచ్.ఎన్.రమ ణమ్మ, హెచ్.వి.ప్రేమలత, హెచ్.ఎస్.మోహన్, ఎంఎల్‌హెచ్‌పి రాజు, ఏఎన్ఎం, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లలగుంట గ్రామ ఉపసర్పంచ్, ఇద్దరు మాజీ సర్పంచ్‌లు,

## అయిదుగురు వార్డు సభ్యులు 100 మంది వైసీపీకి రాజీనామా టిడిపిలో చేరిక

**– నియోజకవర్గాన్ని నాలుగు అంశాల ప్రాధాన్యతతో అభివృద్ధి చేస్తా –జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** గొల్లలగుంట గ్రామానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిదిండి శేఖర్ రాజు, గొట్టుముక్కల నరసింహారాజు, ఉప సర్పంచ్ రాయుడు అర్జున్, వార్డు సభ్యులు తలారి ఏసు, రేగుళ్ల రమణ, మాజీ సర్పంచ్ టేకుమూడి సూర్యచంద్ర గంజా సత్తిబాబు తదితర 100మంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన వారందరికీ టిడిపి కండువాలతో స్వాగతం పలికిన నెహ్రూ ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మొట్టమొదటిసారి శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి నియోజవర్గం సాగునీరు త్రాగు నీరు అందించాలని పనిచేసి నాలుగు ఇరిగేషన్ ప్రాజెక్టులు తీసుకొచ్చాను అని అన్నారు. మళ్లీ నన్ను మీరు గెలిపిస్తే నాలుగు అంశాల ప్రణాళికల తో రూపొందిస్తున్నారని నియోజక వర్గానికి పూర్తిస్థాయిలో సాగునీరు త్రాగునీరు అందిస్తానని, సామాన్యుడికి వైద్యం అందుబాటులో తీసుకు రావడానికి మల్టీ నేషనల్ హాస్పిటల్ తీసుకు వస్తానని, అందరికీ విద్య అందుబాటులో తేవడానికి యూనివర్సిటీ తీసుకొస్తాను అని అన్నారు. అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి నాలుగు మండలాల్లో పరిశ్రమలు తీసుకొచ్చి 20,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండ బాబు, జీను మణి బాబు, బస్వా చినబాబు, పైడిపాల సూరిబాబు, సుంకవిల్లి రాజు, కుంచే తాతాజీ, పాఠం శెట్టి బాబ్జి, వెలిశెట్టిశ్రీను, తిరుమలరాజు మురళి రాజు, చిత్రపు బాబు, చింతాకుల ఈశ్వరరావు, రాయుడు వీరబాబు, కృష్ణంరాజు, రాయుడు గోవిందు, కుందపు రమేష్, వైభోగుల కృష్ణ, పడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఇఓ బి.ఆర్.కె.చౌదరి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో గల స్థానిక పద్మనాభకాలనీలో ఉన్న గరల్స్ హైస్కూల్ నందు మంగళవారం ఎంఇఓ బి.ఆర్.కె.చౌదరి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భోజనాన్ని రుచి చూసి, విద్యార్థినిలకు దగ్గర ఉండి వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తుందని ఆయన తెలిపారు. మంగళవారం అల్లూరి ట్రస్ట్ ద్వారా వచ్చిన పులిహోర, దోసకాయ చట్టి, ఎగ్‌లను పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం బి.జె.రవీంద్ర, ఉపాధ్యాయులు పి.సుబ్బారావు శివయ్య, తదితరులు ఉన్నారు.

## నిరుద్యోగ గిరిజన మహిళకు ప్రేరణ ద్వారా ఉపాధి అవకాశాలు

**– సీఐ స్వామి నాయుడు**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని రాజవొమ్మంగి సర్కిల్ జడ్డంగి, రాజవొమ్మంగి స్టేషన్లపరిధిలోని నిరుద్యోగ గిరిజన మహిళలు పోలీసుల ఆధ్వర్యంలో ప్రేరణ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ స్వామి నాయుడు తెలిపారు. అల్లూరి జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ప్రశాంతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో టాటా టెక్నాలజీస్ నందు ఉచిత శిక్షణ, ఉపాధి కోసం 18 నుండి 30 ఏళ్ల లోపు వయసు కలిగిన గిరిజన మహిళలు రెండు మూడు రోజుల్లో సర్కిల్ కార్యాలయం నందు , పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్స్ , మహిళా పోలీసుల వద్ద ఏదో ఒక చోట వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత ఆ పైన గ్రాడ్యుయేషన్ చేసిన మహిళలు విద్యార్హత సర్టిఫికెట్లుతో పాటు ఐడి ప్రూఫ్, రెసిడెన్షియల్ ప్రూఫ్, బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ డాక్యుమెంట్ జిరాక్స్ కాపీలు అందజేయాలన్నారు. నైపుణ్యత ను బట్టి 17 వేలు పైబడి జీతం ఉంటుందన్నారు. మండలంలోని గిరిజన నిరుద్యోగ మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎస్సైలు ఎస్ వెంకయ్య, టి.రఘునాథ రావులు కోరారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం
31 జనవరి 2024
5

## అణగారిన బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం పోరాడిన నేత మహాత్మాగాంధీజీ

– హెచ్ఎం ఎస్.నాగేశ్వరరావు



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** అణగారిన బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం పోరాడిన నేత మహాత్మాగాంధీని ప్రధానోపాధ్యాయులు ఎస్.నాగేశ్వరరావు స్పష్టంచేశారు. మంగళవారం, చిన్నమట్టపల్లి,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహాత్మాగాంధీ 76 వ వర్ధంతిని పురస్కరించుకుని, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్.నాగేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ మహాత్మాగాంధీ మత సామరస్యం కోసం నిరంతరం కృషి చేశారని తెలిపారు.బడుగు బలహీన వర్గాల స్త్రీ విముక్తి కోసం శ్రమించారని ఆయన చెప్పారు. సహపంక్తి భోజనాలు పెద్ద ఎత్తున జరిగేలా సంస్కరణోద్యమం నడిపిన మహా నేతని ఆయన గుర్తుచేశారు.ఈ వర్ధంతి కార్యక్రమంలో టి.విజయ కుమారి,విద్యార్థులు,శానిటేషన్ ఇబ్బంది, కమ్యూనిటీ వర్కర్లు,తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మా గాంధికి ఘన నివాళులు

– పాల్గొన్న ఆర్డీఓ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధి వర్ధంతి పురస్కరించుకుని ఆర్డీఓ జె.సీతారామారావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ తెలుపుతూ గాంధీజీ దేశానికి చేసిన సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సిహెచ్.వెంకటలక్ష్మీ, డిటి భాను కుమార్, సిబ్బంది నారాయణ, రమేష్ కుమార్, సత్తిబాబు, దయానందరాజు, సిసి ఆనంద్, పలువురు ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల అధికారులు నిబంధనలు ప్రకారం పనిచేయాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం ప్రొసీడింగ్స్ ఇచ్చిన అధికారులందరూ పక్కాగా పనిచేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం సమావేశం హాలులో మంగళవారం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నోడల్ అధికారులు, సెక్టార్ల అధికారులు, తాహసిల్దార్లుతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ మండలాల వారీగా సెక్టార్ల వారీగా ఒక్కొక్క మండలంలో ఎన్ని పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి,

ఒక్కొక్క సెక్టారు పరిధిలో ఎన్ని పోలింగ్ స్టేషన్లు ఉన్నాయో మండలాల వారీగా సెక్టార్ల వారీగా ఆయన ఆరా తీశారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయి, అదేవిధంగా రన్నింగ్ వాటరు, కరెంట్ సౌకర్యం, పోలింగ్ స్టేషన్లు ఏ విధంగా ఉన్నాయో చూడాలని సూచించారు. అదేవిధంగా ఆయా సెక్టార్ల పరిధిలో రోడ్లు ఏ విధంగా ఉన్నాయో ఆయన ఆరా తీశారు.



ప్రతీ మండలంలో ఆయా సెక్టార్ లకు సంబంధించిన మ్యాపులు తయారుచేసి సమర్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బందిని, అదేవిధంగా పోలింగ్ అధికారులకు ఏ వాహనాలు కావాలో ప్రతిపాదనలు తయారు చేసి సమర్పించాలన్నారు. రంపచోడవరం ఎస్టీ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 399 పోలింగ్ బూత్ లకు 59 మంది సెక్టారు అధికారులను, 18 మంది నోడల్ అధికారులను ప్రస్తుతం నియమించడం జరిగిందని ఆయన తెలిపారు. త్వరలో సెక్టారు అధికారులకు, నోడల్ అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు పెండింగ్ లేకుండా పూర్తిచేయాలన్నారు.రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో అన్ని పోలింగ్ బూతుల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు.

అన్ని మండలాలలో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని మండలాల్లో నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, తాహసిల్దార్లు ఎప్పటికప్పుడు పోలింగ్ బూతులు పరిశీలించాలన్నారు. నియోజకవర్గం పరిధిలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ యన్ వివి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, ఇందిరా బాయి పాల్గొన్నారు.

## పాలన మారింది... ప్రజలు ఆలోచించాలి

– లంచాలు లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్నాయి
– పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు,
ఎంపీ వంగా గీతా విశ్వనాథ్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పాలన మారింది... ప్రజలు ఆలోచించాలని, లంచాలు లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్నాయని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. స్థానిక వైస్సార్సీపీ పార్టీ కార్యాలయం వద్ద డ్వాక్రా మెప్మా అధికారుల ఆధ్వర్యంలో మహిళలకు 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. పిఠాపురం పట్టణ పరిధిలో గల 723 సంఘాలలోని 7193మంది లబ్దిదారులకు రూ. 5,24,19,583 (అక్షరాలా ఐదు కోట్ల ఇరవై నాలుగు లక్షల పందొమ్మిదివేల ఐదువందల ఎనబై మూడు రూపాయలు) చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా మహిళలకు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు నేరుగా మేలు చేకూరిందని తెలిపారు. ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ... ఎటువంటి లంచాలకు తావు లేకుండా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలతో ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలంతా సిద్దంగా వున్నారని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా... నవరత్నాల ద్వారా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని అన్నారు. అనంతరం కార్యక్రమంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు ( బ ాబీ ), వైస్ కౌన్సిలర్లు, నాయకులు పచ్చిమళ్ళ అప్పలరాజు, కొత్తపల్లి బుజ్జి, బాలిపల్లి రాంబాబు, బండి రవి, నల్లమిల్లి పవన్ కుమార్, చెల్లూరి లోవరాజు, పెదపాటి నాగేశ్వరరావు, మరియు కార్యకర్తలు, మెప్మా అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 3న ఏలూరులో జరిగే సిద్ధం కార్యక్రమం విజయవంతం చెయ్యాలి



**అమలాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి విశ్వరూప్ ఆధ్వర్యంలో ఇందుపల్లి ఎ 1 కన్వర్షన్ హాల్లో సమావేశం మంగళవారం జరిగింది. రూరల్ మండల ప్రధాన కార్యదర్శి సూదా గణపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏలూరులో ఫిబ్రవరి 3వ తారీకున జరగబోవు సిద్దం కార్యక్రమానికి వేలాదిగ అమలాపురం నుండి బయలు దేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అలాగే ప్రతి కార్యకర్త జగన్‌ను సీఎం, విశ్వరూప్‌ను ఎమ్మెల్యే చేసేవరకు శ్రమించాలని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ విజయకేతనం ఎగురవేసి, సంక్షేమ పథకాలు కొనసాగింపు కొరకు కృషి చేయాలని వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యులకు పిలుపు యిచ్చారు.

## యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించుకుంటే త్వరలో సమ్మెలోకి వెళ్తాం



– యూనియన్ గౌరవాధ్యక్షులు ఏఐటీయూసీ నేత తాటిపాక మధు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా వివో ఏ మూడు సంవత్సరాల కాల పరిమితి 64 జీవోలు సర్కులర్ రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని లేకుంటే తప్పని పరిస్థితిలో సమ్మెలోకి వెళ్తామని ఆంధ్రప్రదేశ్ ఆర్పీలు యానిమేటర్ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక గ్రౌండ్లో లో జిల్లా విస్తృతస్థాయి సమావేశం యూనియన్ అధ్యక్షురాలు ఎం శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రభుత్వం చేపడుతున్న విధానాలను యూనియన్ ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి ప్రవేశపెట్టారు భవిష్యత్తు కర్తవ్యాలను యూనియన్ కోశాధికారి కనక ఆమోదించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తాటిపాక మధు ,ఎం శ్రీదేవి మాట్లాడుతూ ఎలాంటి వేతనాలు లేకుండా ఏళ్ల తరబడి సంఘాల ఏర్పాటుకు అభివృద్ధికి రాత్రి పగలు శ్రమ చేసిన మూడు సంవత్సరాల కాలపరిమితి విధించి తొలగించాలని నిర్ణయించడం అన్యాయం అన్నారు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పేదరికం పేదరికంని నిర్మూలించాలి కానీ యానిమేటర్ లను నిర్మూలించాలని కోవడం అన్యాయం అన్నారు వివో ఏ ల మెర్జ్ చేయడం వలన వేలాది మంది వివోఏలకు ఉపాధి పోతుందని ఉపాధికి నష్టం లేకుండా ఎక్కువ సంఘాలు ఉన్న తక్కువ సంఘాల ఉన్న సర్దుబాటు చేయాలని ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదని వారు కోరారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విఓఎ మీద కనికరం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు సీనియర్ యానిమేటర్ లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు ప్రతి నెల జీతం వ్యక్తిగత ఎకౌంట్లో వెయ్యాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 25000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇంకా ఈ సమావేశంలో యూనియన్ జిల్లా నాయకురాలు లలిత ఈశ్వరి లక్ష్మి ఉమ్మడి జిల్లా నుండి వివిధ మండలాలు నుండి తదితరులు ప్రసంగించారు.

## మహాత్మునికి ఘననివాళి



**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** గౌరీపట్నం శ్రీ వెంకటేశ్వర గురుకుల విద్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం ప్రిన్సిపాల్ బి. కోటేశ్వరరావు లావణ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మానవత కన్వీనర్ దేవరపల్లి మండల బాలోత్సవ కమిటీ అధ్యక్షులు బలుసు సత్యనారాయణ, కేశిరాజు సీతారామయ్య పాల్గొని మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బలుసు సత్యనారాయణ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ దేశ స్వాతంత్ర్య ఉద్యమాన్ని అహింస మార్గంలో నడిపించారని, కష్టం శ్రమ లేకుండా జీవితంలో దేనిని సాధించలేమని శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీకు బానిస అవుతుందని మహాత్మా గాంధీ అన్నారని ప్రతి ఒక్కరు ఉన్నత ఆశయంతో చదివి తల్లిదండ్రులకు దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. దేవరపల్లి మండల బాలోత్సవ కార్యక్రమంలో గురుకుల విద్యాలయం నుండి 72 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించి ఎనిమిది ఈవెంట్లో మెడల్స్ మరియు షీల్డ్ సాధించారని అన్నారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల మానవత ఉపాధ్యక్షులు ఆచంట సుభాష్ చంద్రబోస్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మన్యం నోట అనంతబాబు మాట...

– ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి మాట
– వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు









**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** మన్యంలో ఎక్కడవిన్నా ఆనంతబాబు, మాట వినిపిస్తోందని,ఆంధ్రప్రదేశ్, రాష్ట్రంలోఎక్కడవిన్నా జై జగన్మోహన్ రెడ్డి, జై వై.సి.పి.అనే మాట వినిపిస్తోందని, విజయం ఖాయమని, మెజారిటీ దిశగా నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,మహిళలు,గట్టిగా పనిచేసి 175/175 టార్గెట్‌ని చేరుకునేం దుకు పట్టుదలతో ముందుకు వెళ్లాలని మాదిరెడ్డి సత్తిబాబు, సూచన ప్రాయంగా కార్యకర్తలకు, నాయకులకు,విన్నవించారు. మంగళవారం,తనస్వగృహంలోని ఓపెన్ హౌస్‌లో ముఖ్య కార్యకర్తలు సమావేశం జె.సి.ఎస్.మండల ఇంచార్జ్, బొడ్డు సత్యనారాయణ, ఎస్.టి.ఎస్.సి.కమీషన్ సభ్యులు చిక్కాల బాలకృష్ణ,(బాలు) సీనియర్ నాయకులు ముత్యాల గౌతమ్,అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ ఫిబ్రవరి3 తారీకున ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏలూరు పట్టణంలో జరిగే శంఖారావం భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.వరరామచంద్రాపురం మండలం నుండి అన్నీ పంచాయతీల్లోనుండి భారీగా వెళ్లేందుకు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు,నాయకులు, సిద్దంగా ఉన్నారని,ఆదిశగా మండల నాయకత్వం బాధ్యత వహించి కార్యకర్తలను,ప్రజలను బహిరంగ సభకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ కుటుంబంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి,అభిమానులు,ఆదరించే కార్యకర్తలు ఉన్నారని ఆయన తెలిపారు.ఇచ్చిన హామీలకు కట్టుబడి,నవరత్నాలను దిగ్విజయంగా ప్రజలకు అందించిన ఘనత, మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సాధించారని ఆయన గుర్తుచేశారు.సంక్షేమానికి పెద్దపీటవేసి ప్రజలందరికీ న్యాయం చేశారని ఆయన తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని,గెలిపించి సంక్షేమ కార్యక్రమాలను నిలబెట్టుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో జానాటి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ ముంజపు రాము,కడుపు సాయి, మోడెం నరేశ్,మడకం కన్నారావు,కమ్మచిచ్చు వెంకటేశ్వర్లు,కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## డైరీఫాం సెంటర్‌లో జనసేన 'మేము సిద్ధం' కార్యక్రమం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఎ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో మేము సిద్ధం కార్యక్రమం డైరీ ఫాం సెంటరు వద్ద డివిజన్ అధ్యక్షులు జంప అప్పలరమణ ఆధ్వర్యంలో జరిగినది. ఈ సందర్భంగా ముత్తా శశిధర్ మాట్లాడుతూ నేటి ప్రజా జీవితంలో కరెంటు అన్నది ప్రధాన పాత్ర పోషిస్తోందనీ, దాని సరఫరా మరియు ఉత్పత్తి నిర్వహణా తదితరములు ప్రభుత్వమే చేపడుతుందనీ అన్నారు. మరి అలాంటివాటిని ప్రభుత్వం వ్యాపారం లాగ చేస్తే ప్రజలు నానా నరకయాతన పడుతున్నారనీ అందుకు సాక్ష్యం నేడు ఈ వై.సి.పి. ప్రభుత్వం హయాములో ఇప్పటి వరకు సుమారు 8 సార్లు పెంచిన విధ్యుత్ చార్జీలే నిదర్శనం అన్నారు. అసలే ఒకపక్క సంపాదన అవకాశాలు పరిస్థితులు జఠిలముగా ఉన్న పరిస్థితులలో ఈ ప్రభుత్వం ఎప్పుడో పంపిణీ చేసిన కాలంలోని బిల్లుల చార్జీలను ఇప్పుడు వేస్తూ ముక్కుపిండి వసూలు చేయడం తీవ్రమైన అన్యాయం అనీ, అందుకే ప్రజలు ఈ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి మేము సిద్ధం అని చెపుతున్నారనీ అన్నారు. ఇక ఉన్నది 60 రోజులు మాత్రమే అని ఈ పీడ పోడానికి తమ ఓటుతో సమాధానం చెప్పడానికి మేము సిద్ధం అని నినాదాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి తలాటం సత్య, జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, జిల్లా సమ్యుక్త కార్యదర్శి బడే క్రిష్ణ, సిటి ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ, కిషోర్ కుమార్, బొద్దు రాజు, పెమ్మాడి దుర్గారఒ, కర్రి సత్యసాయి, కొమ్మన సురేష్, బడగంటి సురేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సవాల్‌ను చంద్రబాబు స్వీకరించాలి

– ఎస్సీ సెల్ నాయకులు సాలి వేణు



**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** చంద్రబాబు నాయుడు వయస్సుకు తగ్గట్టుగా మాట్లాడాలని 40 సంవత్సరాల రాజకీయ ఇండస్ట్రీ 14 సంవత్సరాల ముఖ్యమంత్రి అని చెప్పుకొనే చంద్రబాబు కౌటవిం లేకుండా ఏనాడైనా ఎన్నికల్లో పోటీచేసారా అని గోపాలపురం నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు సాలి వేణు ప్రశ్నించారు. సోమవారం రాజమండ్రిలో జరిగిన సభలో కొవ్వూరు చెత్త గోపాలపురం, గోపాలపురం చెత్తను కొవ్వూరుకు మార్చారని చేసిన అర్ధరహితమైన వాఖ్యలను చంద్రబాబు వెనక్కి తీసుకోవాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో పాయకరావు పేట నుండి చెత్తను తీసుకొచ్చి కొవ్వూరులో నిలబెట్టిన సంగతి మరిచిపోయారని ఎద్దేవా చేసారు. సింహం సింగల్ వస్తుందని చెప్పడానికి జగన్మోహన్రెడ్డి విసిరిన సవాల్ ను చంద్రబాబు స్వీకరించాలన్నారు.

చెత్త పోగేసుకుని వైఎస్సార్ సీపీని విమర్శించడం అర్థరహితమన్నారు. అనధికార పొత్తులు పెట్టుకున్న వ్యక్తి చంద్రబాబు మాత్రమేనని సాలి వేణు విమర్శించారు.

## ఏజెన్సీ ప్రాంత విద్యా ప్రదాత అబ్దుల్ కలామ్ స్కూల్ అధినేత సాదత్

– బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత బి.ఎన్.ఆర్...







**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో విద్యావిధానంపై సమగ్రమైన పరిజ్ఞానంతో విద్యార్థినీ విద్యార్థులను అద్భుతమైన రీతిలో తీర్చిదిద్దుతున్న అబ్దుల్ కలాం స్కూల్ కరెస్పాండెంట్ సాదత్ నిజమైన విద్యాప్రధాతని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక బ్రిలియంట్ విద్యా సంస్థలు అధినేత బి.ఎన్.ఆర్.తన అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం అబ్దుల్ కలామ్ స్కూల్ కరెస్పాండెంట్ యం. డి.సాదత్ ను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బి.ఎన్.ఆర్ మాట్లాడుతూ మారుమూల ఏజన్సీలో విద్యారంగంలో విశేషమైన కృషి చేస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ అతి సామాన్య విద్యార్థులను సైతం నవోదయ,గురుకుల వంటి పోటీ పరీక్షలకు తనదైన శైలిలో విద్యార్థులను,సిద్ధం చేస్తూ అందరి మన్ననలను పొందుతున్న మన సాదత్ నీరు పేద విద్యార్థుల తల్లిదండ్రులు గుండెల్లో సముచితమైన స్థానాన్ని సంపాదించారని ఆయన కొనియాడారు. గత మూడు దశాబ్దాల నుండి వివిధ విద్యాసంస్థల్లో వందలమంది విద్యార్థులను విద్యావంతులు చేసిన నిగర్వి, నిస్వార్థపరుడు,మృదుస్వభావి అయిన సాదత్ ను ఒక విద్యాసంస్థల చైర్మన్ గా సన్మానించడం నాకు చాలా గర్వంగా ఉందని ఆయన తన మనస్సులోని మాటలను పంచుకున్నారు.1989 నుండి వివిధ విద్యాసంస్థలైన ప్రభుత్వ జూనియర్ కళాశాల కూనవరం, లో భద్రాచలం త్రివేణి జూనియర్ కాలేజీలో,సాయి ప్రశాంతి డిగ్రీ కాలేజి కూనవరంలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని ఆయన అన్నారు.ఆయన వద్ద విద్యనభ్యసించినవరరామచంద్రాపురం,కూనవరం,వేలేరుపాడు, చింతూరు,కుక్కునూరు, మండలాల విద్యార్థులు మంచి స్థాయిలో స్థిరపడ్డారని ఆయన గుర్తుచేశారు.ఇటువంటి వారు ఈ ఏజెన్సీలో ఉండడం(పుట్టడం)మన అదృష్టమని,ఈప్రాంత ప్రజలు వీరి సేవలు గుర్తించాలని ఆయనకోరారు.

ఈకార్యక్రమానికి విచ్చేసిన"వివేకానంద స్కూల్" ప్రిన్సిపాల్ కె.కృష్ణార్జునరావు, మాట్లాడుతూ,ఈప్రాంత సుపరిచితులు,అపారఅనుభవం కలిగిన విద్యావంతులు వరరామచంద్రాపురంలో విద్యాలయం ఏర్పాటు చేసి నడపడం (సేవలు అందించడం) ఈ ప్రాంత వాసుల అదృష్టమని ఈ సన్మాన కార్యక్రమానికి తనుకూడా పాలుపంచుకోవడంనా జన్మ, జన్మల అదృష్టంగా భావిస్తున్నాని ఆయన ఆనందం వెలిబుచ్చారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ విద్యా సంస్థలు కో– ఆర్డినేటర్ కార్తిక్ నాయుడు,అబ్దుల్ కలాం స్కూల్ ప్రిన్సిపాల్ మాదిరెడ్డి.రామ లక్ష్మీ ,ఉపాధ్యాయులు రమ్య,లహరి, భవాని,మీనా, తరుణ్,సావిత్రి, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కిర్లంపూడి ఎస్సైగా షేక్ జబీర్ బాధ్యతలు స్వీకరణ



**కిర్లంపూడి, మేజర్ న్యూస్ :** కిర్లంపూడి ఎస్సైగా షేక్ జబీర్ మంగళవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటివరకు కాకినాడ పోర్టు ఎస్సైగా విధులు నిర్వహించి కిర్లంపూడి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఎస్సై గా విధులు నిర్వహించిన పి. ఉమామహేశ్వరరావు కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయం కి వి.ఆర్ కి వెళ్ళినట్లు తెలిపారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ జబీర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలనేపథ్యంలో మండల పరిధి అన్ని గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రత లను అదుపులో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు.